జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం





# రేవంత్ పనయిపోయిందా?

- మునుపటి మాదిరిగా ప్రసంగాలకు రాలని ఓట్లు
- చప్పట్లే తప్ప ఓట్లు రాని రివర్స్ గేర్‌లో రేవంత్
- కాళ్లకు బలపాలు కట్టుకుని తిరిగినా తప్పని ఓటమి
- ఏరి కోరి మరీ అభ్యర్థుల ఎంపిక చేసినా చేదు ఫలితమే
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం చేసిన తొలి సీఎం
- అయినా తప్పని కాంగ్రెస్ అభ్యర్థుల పరాజయం
- కోదండరామ్ వర్గీయుడికీ తప్పని ఓటమి
- రేవంత్ గ్రాఫ్ పడిపోతోందా?
- ఫలితాలే ప్రమాద ఘంటికలంటున్న సీనియర్లు
- ఏకపక్ష ఎంపికలే ఓటమికి కారణమంటూ ఫైర్
- రేవంత్‌పై ఢిల్లీకి ఫిర్యాదుల వెల్లువ
- రేవంత్ ఏడాది పాలనకు రెఫరెండమేనా?







కామెంట్



(మార్తి సుబ్రహ్మణ్యం)

"కేసీఆర్ అనేది ఇప్పుడు ఒక ఎక్సపయిరీ మెడిసన్. ఆయన పనయిపోయింది"- ఇది ఎన్నికలకు ఆరునెలల ముందు నుంచీ నాటి పిసిసి ఛీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన మానసిక ప్రచారం. నిజానికి అది 'అత్తారింటికి దారే ది' సినిమాలో, పవన్‌నుద్దేశించి రావు రమేష్ వాడిన డైలాగ్! 'ప్రతి మెడిసిన్‌కు ఒక ఎక్సపయిరీ డేటుంటుంది. నువ్వు కూడా అలాంటివాడివే సిద్దూ. రావిచెట్టుకు పూజలు చేస్తాం. కానీ అదే మనింటి గోడలో మొలిస్తే పీకేస్తాం' అంటాడు ఆ సినిమాలో! రేవంత్ కూడా గత ఎన్నికల ముందు, సేమ్ అదే డైలాగ్‌ను కేసీఆర్‌పై ప్రయోగించి సక్సెస్ అయ్యారు.

సీన్‌కట్ చేస్తే..

గతంలో కేసీఆర్‌పై చేసిన అవే వ్యాఖ్యలు, భావన సీఎంగా ఉన్న అదే రేవంత్‌రెడ్డిపై మొదలయిన వైచిత్రి. కారణం.. తాజాగా జరిగిన టీచర్స్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం! బహుశా ఈ కారణంగానేమో.. రేవంత్‌రెడ్డి పనయిపోయిందా అనే ప్రచారానికి కారణమయింది!! అంటే ఒక రకంగా రేవంత్ పాలనకు ఈ ఫలితాలు రెఫరెండమా?

సహజంగా గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాల ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రులు దూరంగా ఉంటారు. వాటిని లీడర్-క్యాడర్‌కు వదిలేసి, తాము ఎన్నికల ప్రక్రియను నిఘా బృందాల నివేదికలతో పర్యవేక్షిస్తుంటారు. జిల్లాలకు మంత్రులను ఇన్చార్జిగా పెట్టి, వారి ద్వారా అన్ని వ్యవహారాలు నడిపిస్తుంటారు. ఇది ఉమ్మడి రాష్ట్రం నుంచి చూస్తున్నదే. కానీ తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నం. వాటిని కూడా సార్వత్రిక, స్థానిక ఎన్నికల స్థాయిలో ప్రచారం చేశారాయన. ఆకాశమంత సభలు పెట్టారు. ఆర్భాటంగా ప్రచారం చేశారు.

ఆ వేదికలపై.. ఈ ఏడాదిలో తన సర్కారు చేసిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలు పేరు పేరునా ఏకరవు పెట్టారు. మధ్యలో మోదీని, కేసీఆర్‌ను తనదైన శైలిలో విమర్శించారు. ఆ సందర్భంలో జనం నుంచి చప్పట్లు బ్రహ్మాండంగా వచ్చాయి. మీడియాలో పతాక శీర్షికల్లో చోటు సంపాదించారు. కానీ చప్పట్లు కొట్టినవాళ్లెవరూ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో రేవంత్ నిలబెట్టిన అభ్యర్థులకు ఓట్లు మాత్రం వేయలేదు. కారణం.. వారిలో గ్రాడ్యుయేట్, టీచరు ఓటర్లు అతి తక్కువ కాబట్టి!


సహజంగా రేవంత్‌రెడ్డి ఒరిజినల్ క్రౌడ్‌పుల్లర్. తెలంగాణలో కేసీఆర్, సంజయ్, ఒవైసీ లాంటి జనాకర్షణ ఉన్న అతికొద్దిమంది నేతల్లో రేవంత్ ఒకరు. కాంగ్రెస్‌లో రేవంత్ స్థాయిలో ఇమేజ్ ఉన్న నేతలు లేరు. చాలామంది సీనియర్లు ఉన్నప్పటికీ, రేవంత్ వంటి వాగ్ధాటి ఉన్న నేత కరవు. ఆయన సభలకు పెద్దగా తరలింపు అవసరం ఉండదు. ఎందుకంటే రేవంత్ కష్టపడి తెచ్చుకున్న ఇమేజ్ అది. అయితే ఎక్కువ కాలం విపక్షంలో ఉన్నందున, సీఎంగా ఉన్నప్పటికీ ఇప్పటికీ విపక్ష నేతగానే మాట్లాడతారు. కేసీఆర్ కుటుంబాన్ని, సంజయ్-కిషన్‌రెడ్డిని తిడుతున్న

మిగతా.. 9లో

# ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం 'ప్రపంచ చరిత్ర'

- నా తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి
- ప్రపంచం పోకడలపై అధ్యయనం చేసి ఇటువంటి పుస్తకం తెలుగులో రాయడం అద్భుతం
- సమాజానికి మంచి పుస్తకాన్ని అందించినందుకు అభినందనలు
- వెంకయ్యనాయుడులో పవర్, పంచ్‌లు తగ్గలేదు...అప్పుడూ, ఇప్పుడూ అలాగే ఉన్నారు
- ప్రజలు మెచ్చుకునే ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ విధానాలు
- నిర్మలా సీతారామన్ ప్రయాణం స్ఫూర్తి దాయకం
- భారత్‌ను బలమైన ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో ఆమె కృషి ప్రశంసనీయంలి
- తెలుగుజాతి అగ్రభాగాన ఉండాలన్నదే నా ఆశయం
- భారీ లక్ష్యాలను సాధించి రాష్ట్ర భవిష్యత్‌ను మార్చాలన్నది నా కల
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- విశాఖపట్నంలో మాజీమంత్రి దగ్గబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణకు హాజరైన సీఎం

విశాఖపట్నం: కొన్నివేల సంవత్సరాల మానవ పరిణామ క్రమాన్ని, ప్రపంచ చరిత్రను పుస్తక రూపంలో తెలుగులో రచించడం అద్భుత ప్రయత్నం. చరిత్రను ప్రతి ఒక్కరూ చదవాలి. దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తకం రాస్తారని నేను అనుకోలేదు. స్వతహాగా రచయిత కానటువంటి రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు. ఎవరూ రాయని విధంగా పుస్తకాన్ని రాశారు. ప్రతి ఇల్లు, ప్రతి లైబ్రరీలో ప్రపంచ చరిత్ర పుస్తకం ఉండాలి. సమయం దొరికి నప్పుడు నేను కూడా ఈ పుస్తకం పూర్తిగా చదువుతాను. నాటి ఆచారాలు, ఆహారపు అలవాట్లు, వ్యవసాయం వంటి అంశాలను పుస్తకంలో పొందుపరిచారు. లోతుకు వెళ్లి, సాధించాలనే తపన ఉంటేనే పుస్తకం రాయడం సాధ్యం అవుతుంది. యుద్ధాలు, సామ్రాజ్యాల ఆవిర్భావం, మత పెద్దల పెత్తనాలు, ఖండాల విభజన, బానిస వ్యవస్థ, అభివృద్ధి.. ఇలా ఏ విషయాన్ని వదిలిపెట్టకుండా ఈ పుస్తకంలో వెంకటేశ్వరరావు ప్రస్తావించారు. భాష కళలు,



వాస్తు, శిల్పం, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, భూస్వామ్య వ్యవస్థ, రాజులతో పాటు ఏపీలో ప్రజాపాలన గురించి కూడా వివరించారు. అచ్చుయంత్రం, సాంకేతిక విప్లవం, భవిష్యత్తులో ఏం జరుగుతోందో కూడా ముందుగానే ఊహించి తెలిపారు. ఇలాంటి మంచి పుస్తకం రాసిన వెంకటేశ్వరరావును అభినందిస్తున్నాను. పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆత్మీయ సమ్మేళనంగా ఉంది. మా కుటుంబం నుంచి మంచి రచయిత అధ్యయనం చేసి పుస్తకాన్ని సమాజానికి అందించారు' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.

మాజీమంత్రి, ఎంపీ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన ప్రపంచ చరిత్ర పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం విశాఖపట్నంలోని గీతం

మిగతా.. 2లో

# వర్సిటీలను బలోపేతం చేస్తాం!

- ఈ ఏడాదిలోనే ఖాళీల భర్తీ
- ఇండస్ట్రీ లైక్ కరిక్యులమ్ తీసుకువస్తాం
- రీ సెర్చ్, ఇన్నోవేషన్ పై దృష్టి
- న్యాయవివాదాలకు తావులేకుండా పకడ్బందీగా డీఎస్సీ నోటిఫికేషన్
- మండలిలో మంత్రి నారా లోకేష్ వెల్లడి



అమరావతి, మహానాడు: విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. సాంకేతిక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య, ఉద్యోగుల వివరాలు, ఖాళీల భర్తీ, యూనివర్సిటీల అభివృద్ధిపై మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. మంత్రి మాట్లాడుతూ.. ఏపీలో జీఆర్(గ్రాస్ ఎన్ రోల్ మెంట్) రేషియో 36.5 శాతం, ఢిల్లీ 49 శాతం, తమిళనాడులో 47 శాతంగా ఉంది. రాష్ట్రంలో చిత్తూరు, గుంటూరులో 45 శాతం కంటే ఎక్కువగా ఉంది. అనంతపూర్, కర్నూలు, శ్రీకాకుళంలో 30 నుంచి 35 శాతం మధ్య ఉంది.

మహిళల విషయానికి స్టెమ్ కోర్సుల్లో తక్కువగా ఉన్నారు. పేటెంట్ ఫైలింగ్స్ విషయానికి వస్తే రాష్ట్రంలో కేవలం 1,400 మాత్రమే పేటెంట్ ఫైలింగ్స్ జరిగాయి. కానీ తమిళనాడులో 7,600 పేటెంట్ ఫైలింగ్స్ జరిగాయి. విశ్వవిద్యాలయాలకు వస్తే ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్ లో మనం తొమ్మిదో స్థానంలో ఉన్నాం. పీహెచ్ డీ విద్యార్థు విషయానికి వస్తే ఏపీలో 5,600 మంది ఉంటే.. తమిళనాడులో 29వేల మంది ఉన్నారు. ప్రస్తుతానికి మనవద్ద ఎలాంటి ట్రాకింగ్ మెకానిజం కూడా లేదు. విద్యార్థుల ప్లేస్ మెంట్స్, జీతాలేంటే వివరాలు లేవు.

మిగతా.. 2లో




08

విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు 100శాతం సాయం అందించండి!



08

ఇంటర్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్



08

బీసీ రిజర్వేషన్ల పెంపునకు మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలి



## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ముసాయిదా చట్టానికి కేబినెట్ ఆమోదం

- 2017లో అసెంబ్లీ ఆమోదించిన రిజర్వేషన్ల పాత బిల్లును వెనక్కి తీసుకోవాలని నిర్ణయం
- టీటీడీ తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మినరసింహ స్వామి ఆలయ బోర్డు
- మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్‌లో ఆతిథ్యం
- సచివాలయంలో కేబినెట్ సమావేశం అనంతరం మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు సంబంధించి జరిపిన కుల సర్వే బలహీన వర్గాల మేదావులు ,కుల సంఘాల నేతల సమావేశం సంప్రదింపుల తరువాత మిస్ అయిన వారికి మరోసారి అవకాశం ఇవ్వడం జరిగింది. రాబోయే శాసనసభ సమావేశాల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలనే

మిగతా.. 2లో

## 2047 నాటికి నెం.1 ఆర్థిక వ్యవస్థగా భారత్

- ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే సాధ్యం
- అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో భారతీయులు
- ప్రపంచవ్యాప్తంగా నాకు అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు
- రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు నాయుడు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2047 నాటికి భారతదేశం నెం.1 ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో భారతీయులు ముందుంటారని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. భారతీయులను యూదు సమాజంతో పోలుస్తూ, ప్రపంచంలో అత్యంత సంపన్నులుగా, ప్రభావవంతమైన వ్యక్తులుగా భారతీయులు ఉన్నారని అన్నారు. గురువారం ఢిల్లీలో రిపబ్లిక్ ప్లీనరీ సమ్మిట్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి పలు అంశాలపై మాట్లాడారు.

### భారతీయుల ప్రతిభ ప్రతిబింబిస్తోంది

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాంతాల్లో భారతీయులు సంపన్నులుగా ఉన్నారని, ఇది వారి ప్రతిభను ప్రతిబింబిస్తుందని సీఎం అన్నారు. అమెరికాలో భారతీయుల సగటు

మిగతా.. 2లో

# 'మైనింగ్'లో అధికారుల నుంచి కార్మికుల వరకు 100 శాతం మహిళలే ఉండేలా చర్యలు

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, మహానాడు: దేశ మైనింగ్ రంగ భవిష్యత్తును తీర్చి దిద్దుతున్న నారీమణుల మధ్య ఈ వేడుకలు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉంది. మైనింగ్ రంగం మాత్రమే కాకుండా మీ శక్తియుక్తులతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని చెప్పేందుకు గర్వ పడుతున్నాను. 2047లో వికసిత భారత్ కలను నెరవేర్చేందుకు బాటలు వేస్తూ ఈ దేశ ఆడబిడ్డలు చరిత్ర సృష్టిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభినందించారు. మహిళా దినోత్సవం సందర్భంగా గనుల రంగంలో మహిళల భాగస్వామ్యం, వివిధ రంగాల్లో మహిళల పాత్ర పై ఇక్కడ జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడారు.

ఎక్కడైతే స్త్రీని పూజిస్తారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారని మనకు శాస్త్రాలు, పురాణాలు చెబుతున్నాయి. అందుకే మైనింగ్ రంగం మాత్రమే కాకుండా అన్ని రంగాల్లో వారి ఆత్మవిశ్వాసం దేశం ముందడుగు వేసేందుకు దోహదపడుతోందని కిషన్ రెడ్డి అన్నారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. నేను హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నప్పుడు జైసల్మేర్ సరిహద్దులో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ కు చెందిన యువతులు గన్ పట్టుకుని పహారా కాస్తుండటం చాలా గర్వంగా అనిపించింది. కశ్మీర్ లో కూడా మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలో కూడా బీఎస్ఎఫ్‌కు చెందిన మహిళా బలగాలు




ఎంతో నిష్టతో డ్యూటీ చేస్తున్నారు. భారతదేశ మహిళలు దుర్గా మాతలుగా మారి దేశాన్ని రక్షించారు. లక్ష్మీ మాతలుగా మారి ఆర్థిక వ్యవస్థను కాపాడారు. సరస్వతీ మాతగా మారి దేశానికి జ్ఞానాన్నిఅందజేశారు. దేశ తొలి మహిళా తత్వవేత్త మైత్రేయి. ఆమె తెలివితేటలు, జ్ఞానం చూసి అందరూ అబ్బురపడేవారు. రాజ్యాన్ని కాపాడుకునేందుకు ధీర వనిత రాణి రుద్రమా దేవి ధైర్యంగా యుద్ధం చేశారు. అలాగే ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూసిన ఘనత ఆమెది. ఇలాగే శక్తి స్వరూపులైన మహిళలు..

మిగతా.. 2లో

# 'జగన్నా'యకా వాటీజ్ దిస్?

- పిచ్చి పీక్స్‌కు వెళుతోందా?
- ఏమిటీ స్థాయి తక్కువ మాటలు
- జనం ఇవ్వనిదాని గురించి ఎందుకీ గోస?
- జగన్‌లో ఫ్రస్టేషన్ పీక్స్



సాధారణంగా ఒకసారి అయినా ముఖ్య మంత్రిగా చేసిన వాళ్లు కొంచెం గౌరవంగా, బాధ్యతగా, ఎంతో కొంత అవగాహనతో మాట్లాడతారు. కానీ మాజీ సిఎం జగన్ కు ఇందులో ఏవీ లేవు. రావు కూడా. ముఖ్యమంత్రి పదవి కోసం తండ్రి శవం పక్కన సంతకాలు సేకరించిన వారి నుంచి మనం సంస్కారం కూడా ఆశించకూడదు అనిపిస్తుంది.

ఈ రోజు ప్రభుత్వంపై, బడ్జెట్ పై, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాన్ పై జగన్ చేసిన వ్యాఖ్యలు చూస్తే ఆయనలో తీవ్ర ఫ్రస్టేషన్ కనిపిస్తోంది. ముఖ్యమంత్రి పదవి లేదు...ఇన్నాళ్లు ఉన్న దోపిడీ ఇప్పుడు లేదు....పార్టీలో నాయకులు నిలబడడం లేదు....ప్రజల్లో ఆయనపై నమ్మకం లేదు....పార్టీ భవిష్యత్ పై భరోసా లేదు....ఫేక్ ప్రచారం జనం నమ్మడం లేదు...బూతు మాటల రాజకీయం లేదు....దీంతో జగన్ కు పిచ్చెక్కినట్లు ఉంది. ఫ్రస్టేషన్ పీక్ కు చేరినట్లు ఉంది.

పవన్ కళ్యాన్‌పై జగన్ వ్యాఖ్యలు జగన్ ఫ్రస్టేషన్ కనిపిస్తోంది. 21 స్థానాల్లో పోటీ చేసి 21 గెలిచిన వాడు పవన్ కళ్యాన్. 175కు 175 అని ఊదరగొట్టి....11 గెలిచిన వాడివి నువ్వు. ఎవరు గొప్ప? ఎవరిది ఏ స్థాయి?

పవన్ కార్పొరేటర్ కంటే ఎక్కువ....ఎమ్మెల్యే కంటే తక్కువ అన్నాడు. కానీ ఒక మాజీ సిఎంగా ఉండి, కార్పొరేటర్ కూడా మాట్లాడని స్థాయికి వెళ్లి మాట్లాడాడు.

మిగతా.. 2లో

జనం గుండె చప్పుడు

# మహానాడు

2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 ||

## వర్సిటీలను బలోపేతం చేస్తాం!

మొదటి పేజీ తరువాయి..

అలాంటి పరిస్థితుల్లో 2014లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని అమరావతిని ప్రకటించారు. అభివృద్ధి వికేంద్రీకరణ నినాదంతో పనులు మొదలుపెట్టాం. అందులో భాగంగా అనంతపూర్‌కు కియా వచ్చింది. చిత్తూరు, కడపకు ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు వచ్చాయి. కర్నూలుకు రెన్యువబుల్ ఎనర్జీ వచ్చింది. ఇప్పుడు డ్రోన్ సిటీ కూడా రాబోతోంది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలంటే.. అక్కడున్న ఐటీఐలు గాని, పాలిటెక్నిక్‌లు గాని చాలా ఫోకస్డ్‌గా కరిక్యులమ్ తీసుకురావాల్సిన అవసరం ఉంది.

### ఇండస్ట్రీ లైక్ కరిక్యులమ్ తీసుకువస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లీప్(లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఏపీ) పేరుతో సెక్టర్స్ స్పెసిఫిక్ ఇన్‌స్టిట్యూషన్స్ పై దృష్టి పెట్టి కాలేజీలు, పాలిటెక్నిక్ లు, ఐటీఐ, యూనివర్సిటీలతో క్లస్టరింగ్ చేయాలనేది ఒక నిర్ణయం. ఇండస్ట్రీ లైక్ కరిక్యులమ్ తీసుకురానున్నాం. పరిశ్రమలతో అనుసంధానం కావాలని అందరికీ చెబుతున్నాం. పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీతో మాట్లాడినప్పుడు కంప్యూటర్ సైన్స్ సీట్లు అన్నీ భర్తీ అవుతున్నాయి. లాంగ్వేజెస్, ఆర్ట్స్ సీట్లు భర్తీ కావడం లేదు. విద్యార్థులు వీటిపై శ్రద్ధ చూపించడం లేదు. మేం మొన్న మా పదో తరగతి మిత్రులతో కలిసినప్పుడు 42 మందిలో ఇద్దరు ఇతర దేశాల్లో లాంగ్వేజెస్ పై రీసెర్చ్ చేస్తున్నారు. లాంగ్వేజెస్ కు సంబంధించిన వర్క్ చేస్తున్నారు. అన్నింటిని పరిశ్రమలతో అనుసంధానిస్తాం. ఇంటర్న్‌షిప్ వర్క్ బేస్డ్ లెర్నింగ్ తీసుకువస్తాం.

### ఈ ఏడాదిలోనే విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీ

యూనివర్సిటీల్లో ఖాళీలు ఉన్నమాట వాస్తవం. ఈ ఏడాది ఖాళీలన్నీ భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నాం. వన్ మ్యాన్ కమిషన్ రిపోర్ట్ వచ్చిన వెంటనే ఆ ప్రక్రియ కూడా ప్రారంభిస్తాం. ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ విషయానికి వస్తే పరిశ్రమ నిపుణులతో ప్రాక్టీషనర్స్ పాఠాలు చెబితే బాగుంటుందని భావిస్తున్నాం. అక్రిడేషన్, క్వాలిటీ అస్యూరెన్స్ కూడా చాలా అవసరం. అది కూడా తీసుకువస్తున్నాం. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్.. కెపాసిటీ బిల్డింగ్, వారికి కావాల్సిన ఇంటర్నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ వంటివన్నీ ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. డిజిటల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చేస్తాం.

### రీసెర్చ్, ఇన్నోవేషన్ పై దృష్టిపెడతాం

రీసెర్చ్, గ్లోబల్ అవుట్ రీచ్ విషయానికి వస్తే.. రీసెర్చ్ విషయంలో మనం చాలా వెనుకబడి ఉన్నాం. దీనిపై ఎక్కువ ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. ఏయూలో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటుచేయాలని ఎన్వీడియాను కోరాం. రీసెర్చ్, ఇన్నోవేషన్ పై దృష్టిపెడతాం. స్టార్టప్ ఇంక్యుబేషన్ బలోపేతం చేస్తాం. గ్లోబల్ టాలెంట్ కూడా రావాలి. టీచింగ్ టాలెంట్ రావాలి, విద్యార్థులు కూడా రావాలి. అంతర్జాతీయ విద్యార్థులు మన విశ్వవిద్యాలయాల్లో చదవాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. స్టడీ ఇన్ ఏపీ బ్రాండింగ్ కూడా చేయాలని నిర్ణయించాం.

### యూనివర్సిటీల బలోపేతానికి రూ.2 వేల కోట్ల కేటాయింపు

బడ్జెట్‌లో కూడా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసేందుకు రూ.2వేల కోట్లు కేటాయించాం. మౌలిక వసతులు, పరిశోధనల కోసం ఆ నిధులను ఖర్చుపెడతాం. కేంద్రం కూడా అనేక కార్యక్రమాల కింద విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయిస్తోంది. వాటిని జతపరచి కార్యక్రమాలు చేపడతాం. డీఎస్సీ విషయంలో గతంలో జరిగిన తప్పులను స్టడీ చేసి న్యాయపరమైన వివాదాలకు తావులేకుండా పకడ్బందీ నోటిఫికేషన్ ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

విశ్వవిద్యాలయాల్లో నియామకాల అంశం కూడా కోర్టులో ఉంది. దీనిపై ఏజీతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. విశ్వవిద్యాలయాల్లో 4,330 శాంక్షన్ పోస్టులు ఉంటే కేవలం 1,048 పోస్టులు భర్తీ చేశారు. 3,282 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేస్తాం. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాకింగ్స్‌లో ఏపీ 9వ స్థానంలో ఉంది. మూడో స్థానానికి తీసుకు రావాలనేది లక్ష్యం. క్యూఎస్ ర్యాంకింగ్ లో టాప్–100లో ఒక ప్రభుత్వ విశ్వవిద్యాలయం ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

## 2047 నాటికి నెం.1 ఆర్థిక వ్యవస్థగా భారత్

మొదటి పేజీ తరువాయి..

ఆదాయం మిగిలిన వర్గాల కంటే రెట్టింపని చెప్పారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన భారతీయుల్లో 33 శాతం మంది తెలుగు కమ్యూనిటీకి చెందినవారు ఉన్నారని అన్నారు. భారతదేశ వృద్ధికి ముఖ్యంగా మూడు రంగాలపై దృష్టి పెట్టినట్టు ముఖ్యమంత్రి వివరించారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా ఐటీ నుంచి ఏఐ కి మారడం... గ్రీన్ హైడ్రోజన్‌లో అభివృద్ధి సాధించడం... మానవ వనరులని బలోపేతం చేయడంపై తమ లక్ష్యమన్నారు. ఈ రంగాలపై దృష్టి సారించడం వల్ల భారతీయులు ప్రపంచంలోనే అత్యుత్తమ శ్రామిక శక్తిగా, ఆవిష్కర్తలుగా మారతారని అన్నారు.

### భారతదేశానికి జనాభానే బలం:

భారతదేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపు ఉన్నందున, భారతదేశానికి జనాభా ప్రయోజనం ఉంది. చైనా, జపాన్ జనాభా తగ్గడం భారతదేశానికి కలిసొచ్చే అంశమని దానిని దేశ అభివృద్ధికి తెలివిగా వినియోగించుకోవాలని చెప్పారు. ఇద్దరు పిల్లల కంటే తక్కువ ఉన్న అభ్యర్థులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హులని చేసే విధానంపై కేంద్రం ఆలోచన చేయాలని సూచించారు.

### అమరావతి పునర్నిర్మాణం

గత కొన్నేళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఏపీ రాజధాని అమరావతిని పునరుజ్జీవింపజేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచంలోనే ప్రత్యేకమైన సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడల్‌ను ఉపయోగించి 29,000 మంది రైతుల దగ్గర నుంచి 35,000 ఎకరాల భూమిని రాజధాని కోసం సేకరించారని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యుత్తమ రాజధాని నగరాల్లో ఒకటిగా అమరావతిని తీర్చిదిద్దుతామని, దానిని మళ్లీ గాడిలోకి తీసుకువస్తామని చెప్పారు.

### చారిత్రాత్మక విజయం

2024 ఎన్నికల్లో టీడీపీకి 93 శాతం స్ట్రైక్ రేట్, 57శాతం ఓట్ షేరును సాధించిందని ముఖ్యమంత్రి అన్నారు. తన నాయకత్వానికి ప్రజలు బలమైన మద్దతును ఇచ్చారని అన్నారు. తాను ఎలాంటి నేరం చేయకుండా అరెస్టు చేస్తే, ప్రజలంతా ఆ సమయంలో తనకు అండగా నిలిచారని చెప్పారు. గవర్నెన్స్ అంటే కేవలం హార్డ్ వర్క్ మాత్రమే కాకుండా తెలివిగా ఉండాలని, 1,000 సేవలను మీ సేవ – వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందిస్తున్నామని అన్నారు.

### భారతదేశం ముందున్న మార్గం

భారతదేశ అభివృద్ధిని ఆపలేమని చంద్రబాబు అన్నారు. రానున్న 10–15 ఏళ్లలో భారతీయ నిపుణులు సేవా రంగంలో ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం చెలాయిస్తారని అంచనా వేశారు. నేటి ప్రపంచంలో దూరం అనేది ఒక పరిమితి కాదని అన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల ముసాయిదా
## చట్టానికి కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి..

ముసాయిదా చట్టానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

రాజకీయ, విద్య ఉద్యోగ అవకాశాల్లో 42 శాతం బీసీ లకు రిజర్వేషన్లు ఉండాలని వేరు వేరు బిల్లులు పెట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. గతంలో 2017 లో 37 శాతానికి తీసుకున్న నిర్ణయం బిల్లు వెనక్కి తీసుకోవాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. బలహీన వర్గాలకు సంబంధించి ప్రభుత్వం చెప్పినట్టు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 4 2024 న ఆమోదించి అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టినప్పటి నుండి ఫిబ్రవరి 4 2025 వరకు చట్టని తీసుకొచ్చి నిర్ణయం నుండి నివేదిక వరకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తుంది. అందరూ సహకరించాలి.

### క్యాబినెట్ నిర్ణయాలు ఇవే

- ఎస్సీ కులాల వర్గీకరణ ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎస్సీ కులాల వర్గీకరణ పై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ మార్చి 2 వ తేదీన తమ రెండో నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఫిబ్రవరి 3వ తేదీన కమిషన్ ఇచ్చిన మొదటి నివేదికలో చేసిన సిఫారసులను ఎలాంటి మార్పులు చేర్పులు లేకుండా యధాతథంగా ధ్రువీకరించింది.
- వివిధ వర్గాల నుంచి వచ్చిన 71 విజ్ఞప్తులను రెండో విడతలో కమిషన్ పరిశీలించింది. కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది.
- బీసీల రిజర్వేషన్లను 42 శాతం పెంచే ముసాయిదా బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేలా ఒక బిల్లు ముసాయిదా.
- విద్యా సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండో బిల్లు ముసాయిదా తయారు చేసిన అధికారులు.
- వేర్వేరుగా ఈ రెండు బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని రాష్ట్ర మంత్రివర్గం తీర్మానం చేసింది.
- 2017లో అసెంబ్లీ ఆమోదించిన రిజర్వేషన్ల పాత బిల్లును వెనక్కి తీసుకోవాలని నిర్ణయం.
- ఫ్యూచర్ సిటీ డెవెలప్‌మెంట్ అథారిటీ (FCDA) ఏర్పాటుకు నిర్ణయం. 7 మండలాలు, 56 గ్రామాలతో ఎఫ్ సీడీఏ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం నాగార్జునసాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే మధ్యన ఉన్న దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో ఫ్యూచర్ సిటీ ని అభివృద్ధి చేసేందుకు ఈ నిర్ణయం. 36 గ్రామాలను HMDA పరిధి నుంచి తొలగించి FCDAకు అప్పగిస్తారు.
- HMDA పరిధిని రీజినల్ రింగ్ రోడ్డు వరకు విస్తరించాలనే ప్రతిపాదన ను కేబినెట్ ఆమోదించింది. మొత్తం 11 జిల్లాలు, 104 మండలాలు, 1355 గ్రామాలతో HMDA పరిధి పెరుగనుంది. ఈ విస్తరణతో కొత్తగా 332 రెవెన్యూ గ్రామాలు HMDA పరిధిలో కలుస్తాయి.
- టీటీడీ బోర్డు తరహాలో యాదగిరిగుట్ట లక్ష్మినరసింహ స్వామి ఆలయ బోర్డు ఏర్పాటుకు నిర్ణయం. అందుకు వీలుగా తెలంగాణ చారిటబుల్ అండ్ హిందూ రిలీజియస్ ఇన్స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్ యాక్ట్ –1987 కు సవరణలు.
- మే నెలలో జరిగే మిస్ వరల్డ్ 2025 పోటీలకు హైదరాబాద్ లో ఆతిథ్యం ఇచ్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 140 దేశాలు పాలుపంచుకునే ఈ వేడుకలను తెలంగాణ కు ప్రపంచంలో పేరు తెచ్చేలా నిర్వహించాలని నిర్ణయం.
- 10954 గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి ఆమోదం తెలిపిన మంత్రి వర్గం. ఒక్కో రెవెన్యూ గ్రామానికి ఒక జీపీవో నియమించాలని నిర్ణయం. గతంలో వీఆర్వో, వీఆర్‌ఏలుగా పని చేసిన వారికి అవకాశం ఇవ్వాలని నిర్ణయం.

## రేవంత్ రెడ్డి గారూ.. మీరు చేస్తున్నది తెలంగాణ ఫాలింగ్

**- మాజీ మంత్రి హరీశ్ రావు**



హైదరాబాద్: మీరు, మీ ప్రభుత్వ పాలనా వైఫల్యానికి ఇది మరో నిదర్శనం. గత ఆరేళ్లలో ఫిబ్రవరి నెల GST కలెక్షన్ వృద్ధి రేటు (2021 కరోనా సంవత్సరం మినహా) ఎప్పుడూ 6% కంటే ఎక్కువే నమోదు అయింది.

కానీ రేవంత్ రెడ్డిపాలన కరోనా సమయాన్ని తలపిస్తూ 1% మాత్రమే నమోదు చేసింది. కాంగ్రెస్ పాలనలో తగ్గిన ప్రజల కొనుగోలు శక్తికి అద్దం పడుతున్నది.

హైడ్రా, మూసీ వంటి తలా తోక లేని నిర్ణయాలు, అనాలోచిత చర్యల వల్ల ఆగష్టు 2024 తర్వాత రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గణీయంగా తగ్గింది.

2024 ఏప్రిల్ – నవంబర్ మరియు 2023 ఎప్రిల్ – నవంబర్ మధ్య కాలంలో వాహన విక్రయాలు పోల్చితే –0.8% నమోదు అయ్యినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

GST ఆదాయంలో తక్కువ వృద్ధి రేటు, రిజిస్ట్రేషన్ల మరియు వెహికిల్ టాక్స్ లో నెగెటివ్ వృద్ధి రేటు రేవంత్ రెడ్డి పాలన వైఫల్యాన్ని ఎండ గడుతున్నాయి. ఇప్పటికైనా ప్రజలకు క్షమాపణలు చెప్పి – పాలన పై శ్రద్ధ వహించాలని డిమాండ్ చేస్తున్నాం.

## 'జగన్నా'యకా వాటీజ్ దిస్?

మొదటి పేజీ తరువాయి..

దీనికి కారణం అతనిలో ఉన్న సైకో తత్వం, అహంకారం. 11 సీట్లకు ఎందుకు దించారు అనేది జగన్ ఇప్పటికీ ఆలోచన చేయడం లేదు. నేతలు ఎందుకు తనను విడిచిపోతున్నారు అనేది అర్థం చేసుకోవడం లేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 65 శాతం ఓట్ షేర్ తో ప్రజలు ఎందుకు బ్రహ్మరథం పట్టారు అనేది అర్థం చేసుకోలేక....జీర్ణించుకోలేక జగన్ ఫ్రస్టేషన్ తో ఉన్నాడు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి....ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయి...అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులు పట్టాలు ఎక్కాయి.....రాయల సీమలో మళ్లీ డ్రిప్ సబ్సిడీలు ఇస్తున్నారు.. ఇవన్నీ జగన్‌కు కోపం తెప్పిస్తున్నాయి. తన కుట్ర రాజకీయాలు ఇక పనిచేయవు అనే ఫ్రస్టేషన్ కనిపిస్తోంది.

జగన్ మారతాడు అని ఇప్పుడు పార్టీ వాళ్లు కూడా అనుకోవడం లేదు. అందుకే అతనికి దూరంగా పోతున్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప సభకు రాను అని దేశంలో చెప్పిన ఏకైక నాయకుడు ఇతనే అయి ఉంటాడు.

అసెంబ్లీలో మైక్ ఇవ్వరు అని సభకు రాకుండానే చెబుతున్నారు. మరి మండలికి ఎందుకు వైసీపీ ఎమ్మెల్సీలు వస్తున్నారు? అంటే జగన్ ఆలోచనలు ఏంటో అర్థం అవుతున్నాయి.

జగన్ ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా...నచ్చినా నచ్చకపోయినా ఇది కూటమి ప్రభుత్వం. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం. సమిష్టిగా ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వం. నువ్వు సభకు రాకపోతే అది నీకు ఓటేసిన ప్రజలను అవమానించినట్లు అన్న విషయం గుర్తించు.

**- ఏ.బాబు**

## 'మైనింగ్'లో అధికారుల నుంచి కార్మికుల వరకు
## 100 శాతం మహిళలే ఉండేలా చర్యలు

మొదటి పేజీ తరువాయి..

మన దేశ చరిత్రను పునఃలిఖించాల్సిన అవసరం ఉంది.

అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలు జరుపుకొంటున్నాం. అహల్యాబాయి మంచి పరిపాలనతో పాటు దేశ సాంస్కృతిక, చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషించారు. భారత్‌లో మహిళల సాధికారత మన సంస్కృతిలో భాగమనే చెప్పొచ్చు. 2047 నాటికి వికసిత భారత్ దిశగా దూసుకుపోతోంది. ఇందులో మహిళల పాత్ర 50 శాతం ఉన్నప్పుడే అసలైన అభివృద్ధి జరుగుతుంది.

అందుకే నైతికంగానే కాదు.. మన ఆలోచనల్లో కూడా మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఈ అభివృద్ధిలో మహిళలను లబ్ధిదారులను చేయడం కాదు.. ఈ ప్రయాణంలో మహిళలను భాగస్వామ్యం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారు.

సమాజంలోని ప్రతి అడుగులో మహిళల శక్తిని గుర్తింపు నివ్వడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. మహిళల గౌరవాన్ని మరింత పెంచేందుకు స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా మోదీ 11 కోట్ల టాయిలెట్లు నిర్మింపజేశారు.

బేటీ బచావో.. బేటీ పఢావో గురించి మాట్లాడితే ఒకప్పుడు నవ్వేవారు. కానీ ఇప్పుడు ఏటికేటికీ లింగ నిష్పత్తి చూసిన తర్వాత ప్రజలు మోదీ ఆలోచనల గురించి అర్థం చేసుకుంటున్నారు. అలాగే బాలికల భవిష్యత్తు కోసం ఏర్పాటు చేసిన సుకన్యా సమృద్ధి యోజన గురించి కూడా అర్థం కాకపోయేది. కానీ ఇప్పుడు ఖాతాలు భారీగా పెరిగిపోయాయి. మెటర్నిటీ లీవ్స్ కూడా 12 వారాల నుంచి 26 వారాల వరకు పెంచాం. ఇలాంటి ఎన్నో గొప్ప నిర్ణయాల కారణంగా చాలా మార్పులు వచ్చాయి. ఉన్నత విద్యలో మహిళల అడ్మిషన్లు 28 శాతంపైగా పెరిగాయి. సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మెడిసిన్(సిస్టం)లో మహిళల అడ్మిషన్ 43 శాతం మేర పెరిగింది.

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగు నీరందించాం. దీంతో సోదరీమణులందరికీ నీళ్లు తెచ్చుకునే కష్టం తప్పింది. ఉజ్వల యోజన ద్వారా 10 కోట్ల మంది మహిళా మణులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందించాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మించి, వాటికి మహిళలను యజమానులను చేశాం. దీంతో వారిలో ఆర్థిక భద్రత కూడా లభించింది. గతేడాది నరేంద్రమోదీ నమో డ్రోన్ దీదీ అభియాన్ ను ప్రారంభించి సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు వెయ్యి డ్రోన్లను అందజేశారు. స్వయం సహాయక సంఘాలను గత పదేళ్లలో మరింత బలపరిచాం. ఈ గ్రుపులకు చెందిన మహిళల సాధికారత కోసం రూ. 20 కోట్ల మేర ఆర్థిక సాయం చేశాం.

ముద్ర యోజన ద్వారా మొత్తం రుణాల్లో 70 శాతం మహిళలకు అందజేశాం. కోటి మంది మహిళలను లక్షాధికారులను చేసిన ఘనత మోదీ ప్రభుత్వానిది. నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా ఎందరో సోదరీమణులను ఎమ్మెల్యేలు, ఎంపీలు చేస్తున్నాం. రాష్ట్రపతి పదవిని కూడా మోదీ ఓ మహిళకు ఇచ్చారు. గత పదేళ్లలో దేశంలోని ప్రతి రంగం కూడా మహిళలకు అవకాశాలు ఇచ్చేందుకు ద్వారాలు తెరుచుకునే ఉన్నాయి. ప్రస్తుతం భారతదేశంలోని ఎయిర్ ఫోర్స్ పైలట్స్ లో 15 శాతం మంది మహిళలే ఉన్నారు. ఈ విషయంలో ప్రపంచంలోని ఏ దేశం కూడా మనకు దగ్గర్లో కూడా లేదు. అమెరికా, ఆస్ట్రేలియా, జర్మనీలో కూడా ఇంతమంది మహిళలు లేరు.

ఈ సంఖ్యను 30 శాతానికి పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది.

మొదటి నుంచీ మహిళలు వ్యాపారాలు నడుపుతున్నారు. బ్యాంకులకు నేతృత్వం వహిస్తున్నారు. బోర్డు రూమ్స్ లో మార్పులు తీసుకొస్తున్నారు. ఇస్రో, మెడికల్ రీసెర్చ్, విద్య, ఇప్పుడు మైన్స్ రంగంలో కూడా మహిళా శక్తిని నిరూపించుకుంటున్నారు. మహిళలను మైనింగ్ రంగంలోకి సాదరంగా స్వాగతం పలుకుతున్నాం. అండర్ గ్రౌండ్ లో కూడా మహిళలు పనిచేసేందుకు వీలుగా అనుమతులు వచ్చాయి. మైనింగ్ రంగంలో, ప్రైవేటు రంగంలో మహిళల సంఖ్య పెరుగుతూ వస్తోంది. నైట్ షిఫ్టుల్లో కూడా మహిళలు పనిచేస్తుండటం పాజిటివ్ డెవలప్‌మెంట్ అని చెప్పొచ్చు. సింగరేణిలో ప్రత్యేకంగా మహిళలతో పనిచేయించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో మహిళల భాగస్వామ్యం పెరుగుతుంది.

కోలిండియాలో జ్యోతి ఉమెన్ లీడర్ షిప్ కార్యక్రమం ద్వారా మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వడం చాలా సంతోషకరం. మైనింగ్ రంగంలో అధికారుల నుంచి కార్మికుల వరకు 100 శాతం మహిళలే ఉండేలా చర్యలు తీసుకోవాలని బొగ్గు, గనుల శాఖను, కోలిండియాను ఆదేశించాను. మహిళల భాగస్వామ్యం పెరిగితే ఉత్పత్తి సామర్థ్యం కూడా పెరుగుతుందనేది నా నమ్మకం.

మైనింగ్ రంగంలో పనిచేసే వారికి కోటి రూపాయల మేర హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నాం. అలాగే మైనింగ్ రంగానికి మహిళా అంబాసిడర్ ను నియమించనున్నాం. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు మహిళలు అందరూ కలిసికట్టుగా ముందుకు సాగి భారతదేశాన్ని ప్రపంచపటంలో విశ్వగురువుగా నిలపాలని కోరుతున్నాను.

## ప్రతి ఒక్కరూ చదవాల్సిన
## పుస్తకం 'ప్రపంచ చరిత్ర'

మొదటి పేజీ తరువాయి..

యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

### నా తోడల్లుడు వెంకటేశ్వరరావు మా కుటుంబంలో విశిష్టమైన వ్యక్తి

దగ్గుబాటి వెంకటేశ్వరరావు నాకు తోడల్లుడు. మా కుటుంబంలో ఒక విశిష్టమైన వ్యక్తి. ప్రతి అంశాన్ని లోతుగా ఆలోచిస్తారు. మేమిద్దరం ఒక స్ఫూర్తినిచ్చే ఎన్టీఆర్ దగ్గర ఓనమాలు నేర్చుకున్నాం. ఎన్టీఆర్ మాకు అప్పగించిన బాధ్యతలు నిర్వర్తించేవారం. వెంకటేశ్వరరావు డాక్టరు... డాక్టరు చేశాక ప్రాక్టీస్ చేయాలి. కానీ మంత్రిగా ఉండి(నవ్వుతూ) డాక్టర్‌గా ప్రాక్టీస్ చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు.

అందరం ఏదో ఒకచోట తిరగాలని అనుకుంటాం గానీ పుస్తకం రాయాలని అనుకోం. మా కుటుంబంలో వెంకటేశ్వరరావు రిలాక్స్‌గా, జోవియల్‌గా ఉంటారు. ఇటీవల నన్ను కలిసినప్పుడు ఆయన్ను చూసి కొన్ని అనుమానాలను గురించి ప్రస్తావించాను. ఏ విధంగా సమయం గడిపి సంతోషంగా ఉంటున్నారని ప్రశ్నించాను.

దానికి వెంకటేశ్వరరావు సమధానం చెప్తూ....ఉదయం బ్యాడ్మింటన్ ఆడుతాను, పిల్లలతో కాసేపు ఆడుకోవడం, స్నేహితులతో మాట్లాడటం, సాయంత్రం ఇంట్లో పిల్లలకు కథలు చెప్పి నిద్రపోతానని చెప్పారు. పేకాట కూడా ఆడతానని(నవ్వులు చిందిస్తూ) చెప్పారు. ఇప్పటికి వెంకటేశ్వరావు 5 పుస్తకాలు రాశారు. మొదటి పుస్తకం ఒక చరిత్రలో కొన్ని నిజాలు అని రాశారు.

తర్వాత తెలుగువారి చరిత్ర–వేర్పాటువాదం, ప్రపంచతత్వం–నాయకత్వం, ప్రపంచ దేశాలు–పాలనా వ్యవస్థల అనే పుస్తకాలు రచించారు. ఇప్పుడు ప్రపంచ చరిత్ర పుస్తకం రాశారు. అగ్రదేశాలన్నీ యువరక్తం లేక బాధపడుతున్నాయి. టెక్నాలజీ ఉంది.. కానీ ఆపరేట్ చేసే మనుషులు లేని పరిస్థితి తలెత్తింది. కానీ భారతదేశం అదృష్టదేశం. మన దేశానికి కావాల్సినంత యువశక్తి ఉంది. చరిత్రను సృష్టించే అదృష్టం భారతదేశానికి వచ్చింది.' అని సీఎం చంద్రబాబు అన్నారు.

### వెంకయ్యనాయుడులో పవర్, పంచ్‌లు తగ్గలేదు

'1978లో నేను, వెంకయ్య నాయుడు ఎమ్మెల్యేలుగా మొదటిసారి గెలిచాం. అప్పటికీ ఇప్పటికీ ఆయన పవర్ తగ్గలేదు... పంచులు పెరుగుతున్నాయి. ఎప్పుడూ అచ్చతెలుగులో మాట్లాడుతుంటారు. చిన్న కుటుంబలో పుట్టి అంచలంచలుగా ఎదిగి ఉపరాష్ట్రపతి అయ్యారు. గీతం యూనివర్సిటీని గతంలో కూల్చాలని చూశారు. ఎంవీవీస్ మూర్తి ఒక చరిత్ర సృష్టించారు. గీతం యూనివర్సిటీని ఎందుకు నెలకొల్పాల్సి వచ్చిందని ఒకసారి అడిగాను. మా రెండో అబ్బాయికి కాలేజీలో సీటు ఇవ్వలేదు. అందుకే మంచి వ్యవస్థను పెడతాను అని ఛాలెంచ్ చేసి గీతం యూనివర్సిటీని పెట్టానని ఆయన నాకు చెప్పారు.' అని సీఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

### ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకోవడానికి సిద్ధంగా లేను

ఆర్థిక సంస్కరణలు 1991లో వచ్చాయి. మాజీ ప్రధాని పీవీ నరసింహరావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. గతంలో అమెరికా బెస్ట్ అనేవారు... ఇప్పుడు ఇండియన్స్ బెస్ట్ అంటున్నారు. అందులో తెలుగువారు అగ్రభాగాన ఉన్నారు. అశ్రద్ధ లేకుండా కష్టపడితే వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర విజన్ సాకారమవుతుంది. నాలోని ఆత్మస్థైర్యాన్ని పోగొట్టుకోవడానికి నేను సిద్ధంగా లేను. నాలో ఓవర్ కాన్ఫిడెన్స్ ఉందని వెంకయ్యనాయుడు అన్నారు. ఓవర్ కాన్ఫిడెన్స్ మాత్రమే కాదు... బలమైన నమ్మకం ఉంది. దేశాన్ని మోదీ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చాలనుకున్నప్పుడు నా తెలుగుజాతి అగ్రభాగాన ఉండాలన్నది నా ఆశయం.' అని సీఎం ఉద్ఘాటించారు.

### ఇంకొంత ట్రీట్మెంట్ అవసరం

మగవారికంటే మహిళలు బాగా పని చేస్తారు. నిర్మలా సీతారామన్ ఒక సాధారణ కుటుంబంలో జన్మించారు. బీజేపీలో ఒక్కో మెట్టు ఎక్కుతూ ఎదిగారు. 2014లో మొదటిసారి రాజ్యసభకు ఎంపీగా ఏపీ నుంచి ఎంపికై కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నరేంద్రమోదీ ఆశయాల కోసం నిరంతరం పని చేస్తున్నారు. ప్రజలు మెచ్చుకునే ఆర్థిక మంత్రిగా కార్యక్రమాలు చేపట్టారు.

వరుసగా 8వసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2014 నాటికి 10వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను 5వ స్థానానికి తీసుకొచ్చారు. భవిష్యత్తులో 3వ స్థానానికి వస్తుంది. దీనికి మనమంతా అభినందించుకోవాల్సి ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన మందులతో వెంటిలేటర్‌పై నుంచి బయటపడగలిగాం. పూర్తిగా కోలుకోవాలంటే ఇంకా కొంత చికిత్స అవసరం. రాష్ట్రాభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సహకరిస్తున్నారు.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.



## చరిత్ర అంటే గతం కాదు...
## భవిష్యత్‌కు దిక్సూచి

- 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ సందర్భంగా సీఎం చంద్రబాబు వ్యాఖ్య

అమరావతి, మహానాడు: విశాఖలో నేడు మా తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నాను. ఎంతో ఆహ్లాదకరంగా జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి పాల్గొన్నాను. ఎంతో అధ్యయనంతో రచయిత ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. చరిత్ర అంటే గతం కాదు... చరిత్ర అంటే మన భవిష్యత్ కు దిక్సూచి అని నేను భావిస్తాను. ప్రతి ఒక్కరికి చరిత్ర, వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రాజకీయాల్లో ఉండి కోట్ల మంది జీవితాలను ప్రభావితం చేసే వారికి చరిత్ర తెలిస్తే.... ప్రజల భవిష్యత్ ను మార్చే నిర్ణయాలు తీసుకోగలరు. బాధ్యతతో ఉండి ప్రజలకు మంచి చేయగలరు. అటువంటి చరిత్ర గురించి చెప్పే గొప్ప పుస్తకాన్ని తెచ్చిన వెంకటేశ్వరరావుకి, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ఎంపీ పురందరేశ్వరికి అభినందనలు తెలుపుతున్నాను. ఎన్నో పుస్తకావిష్కరణలకు, కార్యక్రమాలకు హాజరైనా.... ఈ రోజు మా కుటుంబ సభ్యుల్లో విశిష్ట వ్యక్తిగా ఉన్న వెంకటేశ్వరావు రాసిన పుస్తకావిష్కరణలో పాల్గొనడం నాకు మిక్కిలి సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందని ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025







## వైసీపీ పాలనలో ఎం.టెక్ సీటు కోల్పోయిన విద్యార్థి!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించని సర్కారు
- మానసిక వేదనకు గురైన కుటుంబం
- వివిధ సమస్యలపై తరలివచ్చిన అర్జీదారులు
- సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మాజీ మంత్రి పల్లె, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి

**మంగళగిరి, మహానాడు:** తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీదారులు టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమానికి తరలివచ్చారు. వారి నుండి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణలు అర్జీలు స్వీకరించి వెను వెంటనే అధికారులతో ఫోన్లలో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

- ఏలూరు జిల్లా, వెంకటాపురం గ్రామానికి చెందిన వనమాడి ఫణికుమార్ గ్రీవెన్స్ లో నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తాను ఆది కవి నన్నయ్య యూనివర్సిటీలో 2020- 2024 మధ్య బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ పూర్తి చేశానని.. అయితే గత ప్రభుత్వం ఫీజ్ రీ యింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించకపోవడంతో తన సర్టిఫికేట్లు ఇవ్వలేదని.. దాంతో తాను ఎం.టెక్ సీటు కోల్పోవాల్సి వచ్చిందని.. దయ చేసి తన సర్టిఫికేట్లు ఇప్పించాలని అభ్యర్థించాడు.
- ప్రకాశం జిల్లా, గిద్దలూరు డివిజన్ పరిధిలో కొన్నేళ్ళుగా తాము వెదురు బొంగుల ఫిల్లింగ్ టెండర్ తీసుకొని స్థానిక ప్రజలకు ఉపాధి కల్పిస్తున్నామని.. కాని ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు ఇంకా టెండర్ ఇవ్వలేదని.. వీలైనంత త్వరగా టెండర్ ఇచ్చేలా చూస్తే దాదాపు 1000 మందికి పైగా ఉపాధి దొరుకుతుందని.. గిద్దలూరుకు చెందిన పలువురు బ్యాంబూ కాంట్రాక్టర్స్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- ఏలూరు జిల్లా, పోలవరం మండలం ఎల్ ఎన్ డీ పేటకు చెందిన పలువురు రైతులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. పోలవరం ప్రాజెక్ట్ భూ సేకరణలో భాగంగా గతంలో సర్వే చేసి ఒక సారి భూమికి హద్దులు ఏర్పాటు చేశాక మళ్లీ అధికారులు ఇటీవల వచ్చి భూ సేకరణ పేరుతో పేద రైతులు ఎప్పటి నుండో సాగు చేసుకుంటున్న భూములను తీసుకునేందకు యత్నిస్తున్నారని.. దీంతో రైతులు నష్టపోతారని.. దయ చేసి దీన్ని పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని గూడవల్లి సుబ్బారావు తదితరులు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- కృష్ణా జిల్లా, గన్నవరానికి చెందిన డి. జయసుధ విజ్ఞప్తి చేస్తూ.. తాను ఏపీవీవీపీ(డీఎస్‌హెచ్)లో 2018 నుండి ఉండటం వలన క్రమబద్ధీకరణలో తనకు అన్యాయం జరిగిందని.. తనను తన మాతృ సంస్థ డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ కు పంపి రెగ్యులర్ చేయాలని ఆమె గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.
- పల్నాడు జిల్లా, గురజాల మండలం పులిపాడు గ్రామానికి చెందిన యాగంటి వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేస్తూ.. తాను ఎన్టీఆర్ జిల్లా నందిగామలో అచ్చి నరసింహారావు అనే వ్యక్తి వద్ద ఇల్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేయించుకున్నానని... అయితే ఇల్లు ఖాళీ చేసేందుకు నరసింహారావు ఐదు నెలలు గడువు కోరారని.. కాని పది నెలలు అయినా ఇల్లు ఖాళీ చేయలేదని.. దీనిపై వెళ్లి అడిగితే ఖాళీ చేయం దిక్కున్న చోటకు వెళ్లి చెప్పుకోండని బెదిరిస్తున్నారని.. వారిని ఇల్లు ఖాళీ చేయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## విజయవంతంగా 'వాట్సాప్ గవర్నెన్స్' సేవలు!

- మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రజల చేతిలో ప్రభుత్వం
- మనమిత్ర ద్వారా పౌరసేవలు 200 మైలురాయికి చేరిక
- ఆధునిక సాంకేతిక వినియోగం దిశగా కూటమి సర్కారు అడుగులు




**అమరావతి, మహానాడు:** పౌరసేవలను మరింత సులభతరంగా ప్రజలకు అందించేందుకు మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనతో ఏపీ ప్రభుత్వం ప్రారంభించిన వాట్సాప్ గవర్నెన్స్ విజయవంతంగా ప్రజలకు సేవలందిస్తోంది. ఈ ఏడాది జనవరి 30వతేదీన మంత్రి లోకేష్ చేతులమీదుగా దేశంలోనే తొలిసారిగా 161 రకాల పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించేందుకు ప్రారంభించిన మనమిత్ర... కేవలం 50 రోజుల్లోనే 200 సేవలు అందించే అద్భుతమైన మైలురాయి సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ గవర్నెన్స్ శక్తికి ఇదో నిదర్శనంగా చెప్పొచ్చు. పౌరసేవలను సమర్థవంతంగా, సులభతరంగా అందు బాటులోకి తేవడం ద్వారా ప్రజలకు సౌలభ్యంతో పాటు పాలనలో పారదర్శకతను పెంచే లక్ష్యంతో గత ఏడాది అక్టోబర్ 22న ఢిల్లీలో మంత్రి లోకేష్ మెటా ప్రతినిధులతో ఏపీ ప్రభుత్వం తరపున ఒప్పందం చేసుకున్నారు.

ఇటీవల టెన్త్, ఇంటర్ విద్యార్థుల తమ హాల్ టిక్కెట్లను సైతం వాట్సాప్ ద్వారా పొందగలిగారు. ప్రజలు వివిధ రకాల పౌరసేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా చేసేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మన మిత్ర నెం. 9552300009 కు వాట్సాప్ సందేశం పంపడం ద్వారా ప్రస్తుతం 200 రకాల పౌర సేవలను ఎపి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. అందులో విద్య, దేవాదాయ, విద్యుత్, ఆర్టీసీ, రెవెన్యూ, అన్న క్యాంటీన్, సీఎంఆర్ఎఫ్, మున్సిపల్ శాఖల సేవలు కూడా ఉన్నాయి. విద్యుత్తు బిల్లులు, పన్నుల చెల్లింపుల వంటి సేవలతో పాటుగా దేవాలయాల్లో దర్శనాలు, వసతి గదుల బుకింగ్, విరాళాల సమర్పణకు ఇది ఉపయోగపడుతోంది.

అలాగే పర్యాటక ప్రదేశాల సమాచారం, టికెట్ బుకింగ్ వంటివి ఈ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈజీగా చేసుకోవచ్చు. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ రికార్డులు, ఆదాయ ధ్రువీకరణ వంటి సర్టిఫికెట్లు కూడా సులభంగా పొందొచ్చు. అధునాతన సాంకేతికత వినియోగం ద్వారా ప్రజలకు పౌరసేవలను ఇంటిముంగిటికే తీసుకెళ్లడం విప్లవాత్మకమైన పరిణామం. వాట్సాప్ బిజినెస్ సర్వీస్ డెలివరీ ప్లాట్ ఫాంగా పలురకాల పౌరసేవలను ప్రజలకు అందిస్తుంది. మూడు ప్రాథమిక నమూనాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి డెలివరీ ప్లాట్ ఫాంగా వాట్సాప్ సేవలను అందించే లక్ష్యం ఏపీ ప్రభుత్వం మెటాతో కుదుర్చుకున్న ఒప్పందం కుదుర్చుకుంది.

ఇందులో జీ టు సీ (ప్రభుత్వం నుండి పౌరులకు), బీ టు సీ(వ్యాపారం నుండి వినియోగదారునికి), జీ టు జీ (ప్రభుత్వం నుండి ప్రభుత్వం). ఈ మేరకు తొలివిడతలో పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. రాబోయే వాణిజ్య రంగంలో సమర్థవంతమైన ప్రభుత్వ సర్వీస్ డెలివరీ కోసం రీ ఇంజనీరింగ్ ప్రక్రియ ద్వారా మనమిత్ర సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆ తర్వాత ప్రభుత్వశాఖల అంతర్గత కార్యకలాపాలకు సైతం దీనిని వినియోగిస్తారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఎటువంటి అవాంతరాలు లేకుండా వేగవంతంగా ప్రజలకు ప్రభుత్వసేవలు అందనున్నాయి.



## తెలంగాణలో ఒంటిపూట బడులు

**హైదరాబాద్, మహానాడు:** రోజురోజుకు ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటిపూట తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 8 గం. నుంచి మధ్యాహ్నం 12:30 గం. వరకు తరగతులు జరగనున్నాయి. 10వ తరగతి పరీక్షలు జరిగే కేంద్రాల్లో మాత్రం మధ్యాహ్నం తరగతులు నిర్వహించనున్నారు.

## బీజేపీకి బరాబర్ రిటర్న్ గిఫ్ట్ ఇస్తాం

- మంత్రి శ్రీధర్ బాబు

- రెండు పార్టీలు కలిసి ఓడించాయి : పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్:** తాము బీజేపీకి ఎన్నో రిటర్న్ గిఫ్టులు ఇచ్చామని, త్వరలో మరొక రిటర్న్ గిఫ్టు ఇస్తామని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీని ఓడించాయని.. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఫెవికాల్ బంధం ఉందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అది మరోసారి వెల్లడైందని ఆయన అన్నారు. ఈ ఓటమిని తాము సమీక్షించుకుంటామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ కలవడమనేది వారి పతనానికి తొలి అడుగు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవడానికి బీఆర్ఎస్ బాగా శ్రమించింది. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి తమకు ఎమ్మెల్సీ ఎన్నికల రూపంలో రంజాన్ గిఫ్టు ఇచ్చిందని భావిస్తే, త్వరలో తామూ ఇస్తామ ని గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన రవీందర్ సింగ్‌కు వచ్చిన ఓట్లు ఆయనకు వ్యక్తిగతంగా వచ్చినవే అని వ్యాఖ్యానించారు.

బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. అభ్యర్థిని పెట్టకుండా బీఆర్ఎస్, బీజేపీతో కుమ్మక్కైందని, కేటీఆర్, హరీశ్ రావు నియోజకవర్గాల్లో జరిగిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారు ఎవరికి ఓటేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## త్వరలో ఉచిత ఆన్‌లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభం

- 10 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి:** మెగా డీఎస్సీ నోటిఫికేషన్ త్వరలో వెలువడనున్న నేపథ్యంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో త్వరలో ఉచిత ఆన్ లైన్ డీఎస్సీ కోచింగ్ ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

ఇప్పటికే 26 జిల్లా కేంద్రాల్లోనూ బీసీ స్టడీ సర్కిళ్ల ఆధ్వర్యంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ సెంటర్లు ప్రారంభించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఇప్పుడు ఆన్ లైన్ ద్వారా ఉచిత డీఎస్సీ కోచింగ్ కు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఇంటి వద్ద నుంచే ఆన్ లైన్ ద్వారా డీఎస్సీ కోచింగ్ పొందవొచ్చునన్నారు. బీసీ, ఈబ్ల్యూఎస్ సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు.

అభ్యర్థులు టెట్ లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఎంతమందికైనా ఆన్ లైన్ ద్వారా ఉచిత శిక్షణివ్వడానికి తమ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ జిల్లాలకు చెందిన జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారులను సంప్రదించాలని ఆ ప్రకటనలో మంత్రి సవిత తెలిపారు.





## 'మత్తు'ను చిత్తు చేసేందుకు పార్టీలకతీతంగా ఏకమవుదాం

- హోం మంత్రి అనిత పిలుపు

**అమరావతి, మహానాడు:** గంజాయి, డ్రగ్స్‌పై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం. 'ఈగల్' టాస్క్ ఫోర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. 30 శాతం ఫిట్ మెంట్ సహా టెక్నాలజీ గురించి తెలిసిన అధికారులు, డ్రోన్లు, సీసీ కెమెరాలతో పటిష్ట వ్యవస్థగా ఏర్పాటు చేశామని శాసన మండలిలో వైఎస్ఆర్‌సీపీ ఎంఎల్‌సీల ప్రశ్నలకు హోంమంత్రి అనిత సమాధానం ఇచ్చారు. ఇంకా, ఆమె ఏమన్నారంటే, ఐదుగురు మంత్రులతో కూడిన సబ్ కమిటీ ద్వారా విధివిధానాలు రూపొందించాం. గంజాయి సాగును చాలా వరకూ తగ్గించాం. గంజాయి కేసుల్లో వైసీపీ చివరి ఏడాది పాలన కాలంలో సుమారు 1,995 మందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కూటమి ప్రభుత్వం ఆరునెలల పాలనలోనే 2,513 మందిని అరెస్ట్ చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి కేసులతో జైళ్లు నిండిపోయాయి.



కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి కేసులు పెరిగాయన్న వైసీపీ ఎంఎల్‌సీ బొమ్మి ఇజ్రాయెల్ వ్యాఖ్యలపై హోంమంత్రి అభ్యంతరం తెలిపారు. గత ప్రభుత్వం గంజాయిపై దృష్టిపెట్టకపోవడం వల్లే దుష్పరిణామాలంటూ ఆధారాలను హోంమంత్రి అనిత బయటపెట్టారు.

గత ప్రభుత్వంలో సీఎం ఇంటికి సమీపంలోనే గంజాయి కొట్టి ఒక యువతిపై అఘాయిత్యం చేసినా స్పందించలేదు, నిందితులను పట్టుకోలేదు. 2021లో దేశ వ్యాప్తంగా మొత్తం 7.50 లక్షల కిలోల గంజాయి పట్టుపడింది. కూటమి ప్రభుత్వంలో గంజాయి సాగు 90శాతం తగ్గింది. డ్రోన్ వస్తే భయపడిపోయి జి.మాడుగుల మండలం ప్రాతపాడు గ్రామంలో గంజాయిని ధ్వంసం చేశారు. గంజాయి సాగుకు అలవాటుపడిన 359 కుటుంబాలలో చైతన్యం కలిగించి ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించేందుకు అవగాహన కలిగించాం.

ఎస్టీలు ఎక్కువ శాతం గంజాయి కేసుల్లో మగ్గుతున్నారు. ఉత్పత్తి, తయారీ, నిల్వ,రవాణా, ఎగుమతి, దిగుమతి, వాడకం, ప్రేరేపించినా అన్నీ నేరాలే. తొమ్మిదినెలల పాలనలో 3 గంజాయి కేసులలో ఆస్తులు జప్తు చేశాం. దేశంలో మొట్టమొదటి కొకైన్ కేసు ఏపీలో నమోదైంది 2021 జగన్ పాలనలోనే... విశాఖపట్రం 3 టౌన్ పోలీస్ స్టేషన్ లో 3 గ్రాముల కొకైన్ పట్టుబడింది, అప్పుడు ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేయడం కూడా జరిగింది.

2022లో గుంతకల్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 20.64 గ్రాముల కొకైన్ పట్టుబడింది, ఆ కేసులో ఏడుగురు అరెస్ట్. 2025లో గుంటూరులో ఎక్సైజ్ పోలీసులు 8.5 గ్రాముల కొకైన్ స్వాధీనం, ముగ్గురు అరెస్ట్. కడప చుట్టుపక్కల ఇంజెక్షన్ల రూపంలో మాదకద్రవ్యాలను సేవించే 120 హాట్ స్పాట్‌లను గుర్తించి నిఘా పెట్టాం. డ్రగ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ సయన్వయంతో మెడికల్ షాపుల్లో దొరికే దగ్గు మందు, టాబ్లెట్ల రూపంలోని డ్రగ్స్ తీసుకునే వారికోసం డీఎడిక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మే మెడికల్ షాపులను సీజ్ చేస్తాం.

తొమ్మిది నెలల కాలంలో ఒడిశా నుంచి వచ్చే గంజాయిని సుమారు 70వేల కిలోలు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశాం. ఒడిశా, తమిళ నాడు, కర్ణాటక, తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో విశాఖలో అంతర్గత సమావేశం నిర్వహించనున్నాం. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకోసం పాఠశాల స్థాయిలోనే అవగాహనకు చర్యలు. టీచర్లు, ప్రిన్సిపల్ల నేతృత్వంలో ఈగల్ కమిటీలు, మెగా పేరెంట్ మీటింగ్ లను ఏర్పాటు చేస్తున్నాం. పోలీసులు, గిరిజన, వైద్య శాఖ నేతృత్వంలో ఇప్పటిదాకా 9,818 అవగాహన సదస్సులు ఇప్పటివరకూ నిర్వహించాం. ఇప్పటిదాకా కోటిమంది చిన్నారుకు అవగాహన కల్పించాం.

46 లక్షల మొక్కలను గంజాయికి బదులు పెంచుకునేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గంజాయి కేసులో పట్టుబడితే కుటుంబం మొత్తానికి ప్రభుత్వ సంక్షేమం తొలగించే దిశగా సమాలోచనలు చేస్తున్నాం. గంజాయి నిర్మూలన విషయంలో పార్టీలకతీతంగా ఏకమవుదాం.





## సేవలు విస్తృతం చేసే లక్ష్యంతో ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నిర్మాణం

- ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)
- భవన నిర్మాణానికి మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శంకుస్థాపన
- భువనేశ్వరికి స్వాగతం పలికిన ఎంపీ దంపతులు

**విజయవాడ, మహానాడు:** ప్రజాసేవే ధ్యేయంగా తెలుగు రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఎన్నో సేవ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆ సేవలు ఏపీ ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ టీచర్స్ కాలనీలో గురువారం జరిగిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీ దంపతులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు విచ్చేసిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరికి ఎంపీ, సతీమణి కేశినేని జానకి లక్ష్మీ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శంకుస్థాపన కార్యక్రమానికి ముందు నారా భువనేశ్వరి టీచర్ కాలనీలోని శ్రీ షిర్డి సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయటంతో పాటు శిలాఫలకం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఏపీ ప్రజలకు మరింత చేరవ చేసేందుకు విజయవాడలో ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం నిర్మాణం చేపడుతున్నందుకు నారా భువనేశ్వరికి ప్రజల తరుపున ధన్యవాదాలు తెలిపారు. ఎన్టీఆర్ ట్రస్ట్ భవన నిర్మాణం అమరావతి రాజధాని ప్రాంతమైన విజయవాడలో, తన పార్లమెంట్ నియోజకవర్గంలో జరగటం చాలా సంతోషంగా ఉందన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ భవనం సిద్ధమైతే పేద విద్యార్థులకు విద్య, పేదలకు వైద్య సౌకర్యాలతో పాటు తలసేమియా కేర్ సెంటర్, బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులోకి వస్తాయన్నారు.

ప్రజలే దేవుళ్లు సమాజమే దేవాలయమన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా నారా భువనేశ్వరి ఎన్టీఆర్ ట్రస్ట్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.





## దొరస్వామి నాయుడు మృతి బాధాకరం: మంత్రి లోకేష్

**అమరావతి, మహానాడు:** పీఈఎస్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ ప్రొఫెసర్ ఎంఆర్ దొరస్వామి నాయుడు మృతి చెందారన్న వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది.

ప్రొఫెసర్ దొరస్వామి నాయుడు ఏపీ, కర్నాటక రాష్ట్రాల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, లైఫ్ సైన్సెస్ 12 విద్యాసంస్థలను నడుపుతూ విద్యాదాతగా నిలిచారు. కుప్పం ప్రాంతంలో పీఇఎస్ విద్యాసంస్థలను నెలకొల్పి విద్యారంగంలో విశేష సేవలందించిన దొరస్వామి మృతి తీరనిలోటు. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ... దొరస్వామి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

4

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 ||

## ప్రతీ మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర దివస్'


◆ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



**అమరావతి, మహానాడు:** స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల ఖరారుపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి కార్యదర్శులు, శాఖాధిపతులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం క్రమం తప్పకుండా స్వచ్ఛాంధ్ర దివస్ ను నిర్వహించాలని అన్ని శాఖలను ఆదేశించారు. ఈసమావేశంలో రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్ రెడ్డి, సిడిఎంఏ జి.సంపత్ కుమార్, న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు చెందిన దశరథరామి రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా వర్చువల్‌గా వివిధ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులు పాల్గొన్నారు.

## వరి రైతుల్ని ముంచేసిన వైసీపీ ప్రభుత్వం!

◆ ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఆరోపణ



**అమరావతి, మహానాడు:** గత ప్రభుత్వం వరిరైతుల్ని నిలువునా దోచేసిందని, పండించిన ధాన్యం అమ్ముకోవడానికి, కొనుగోలు సొమ్ము కోసం, రైతులు కాళ్లు అరిగేలా రైతుభరోసా కేంద్రాల చుట్టూ తిరిగి పెద్దఎత్తున నష్టపోయారని మాజీమంత్రి, శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ధాన్యం కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం వరి రైతుల్ని దోచేసిన వైనాన్ని, రాష్ట్ర రైతాంగ సమస్యల్ని మాజీమంత్రి ప్రత్తిపాటి సభ సాక్షిగా ప్రజలకు తెలిపారు. గత ప్రభుత్వం ఎగ్గొట్టిన రూ.1674కోట్ల ధాన్యం బకాయిని కూటమి ప్రభుత్వం చెల్లించింది.

వైసీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల పేరుతో వరి రైతుల్ని నిలువు దోపిడీ చేసిందని, ధాన్యానికి మద్ధతు ధర ప్రకటించలేదని, రైతులు పోరాటంచేసినా జగన్ ప్రభుత్వం వారిని పట్టించుకోలేదన్నారు. ఆఖరికి ధాన్యం నిల్వకు అవసరమైన గోనెసంచులు (గోతాలు) కూడా ఇవ్వలేక పోయిందన్నారు. గత ప్రభుత్వంలో దళారుల జోక్యం అధికమై రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వైసీపీప్రభుత్వం 84,724 మంది వరి రైతులకు రూ.1674కోట్లు బకాయి పెట్టిందని, ఆ సొమ్మును కూటమి ప్రభుత్వం ఈ 9 నెలల్లో రైతులకు చెల్లించిందన్నారు.

రైతులపై ఏమాత్రం కనికరం, దయలేకుండా వైసీపీప్రభుత్వం నిర్లక్ష్యంగా ప్రవర్తించిందన్నారు.

## పోసానికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ



**అమరావతి, మహానాడు:** పోసానికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పోసాని క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. తనపై నమోదైన కేసులు కొట్టివేయాలని పోసాని పిటిషన్ దాఖలు చేశారు. కాగా, చంద్రబాబు, పవన్, లోకేష్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు. ఆదోని పోలీసులు నమోదు చేసిన కేసులో ఇప్పటికే పీటీ వారెంట్ అమలైనందున కోర్టు పిటిషన్ కొట్టిసింది.

## సంక్షేమానికి దూరంగా ఉన్న మహిళలను ఆదుకోవాలి

◆ 'విముక్తి' సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ




**విజయవాడ, మహానాడు:** కొన్ని దశాబ్దాలుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు జరుపుకొంటున్నా దేశంలో నేటికి అక్రమ రవాణాకు గురైన మహిళలు, వ్యభిచారవృత్తిలో మగ్గుతున్న మహిళలు సంక్షేమానికి దూరంగా ఉన్నారని విముక్తి రాష్ట్రస్థాయి మానవ అక్రమరవాణా, వ్యాపార, లైంగిక దోపిడీ బాధిత సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అపూర్వ ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. మహిళలు ఇప్పటికే ప్రాథమిక గౌరవం, సమాన హోదా కోసం పోరాడుతున్న దేశంలో, అక్రమ రవాణా బాధిత మహిళలు, సెక్స్ వర్కర్లు ఇంకా ఎక్కువ అడ్డంకులను ఎదుర్కొంటు న్నారన్నారు.

సామాజిక కట్టుబాట్లు, నిబంధనలకు సవాలుగా భావించి, వారు అభివృద్ధికి దూరంగా ఉండిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీరి కోసం చేస్తున్న కార్యక్రమాలు ఏవైనా ఉన్నాయంటే అవి కేవలం భారత దేశ జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమం ద్వారా హెచ్.ఐ.వి. నిరోధక సేవలను పొందేలా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్న ఏకైక కార్యక్రమంగా మిగిలిపోయిందన్నారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రగతి శీల మహిళ సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ బాధిత మహిళల మానసిక ఆరోగ్య సేవలు, ట్రామా సంరక్షణ సేవలు, హింస, నుండి రక్షణ, సమాజం లో వారికీ వ్యతిరేకంగా జరుగుతున్న వివక్షత నుంచి వారిని కాపాడి వారికి అవసరమైన పునరావాస కార్యక్రమాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి దుర్గాంభ, విముక్తి రాష్ట్ర కోశాధికారి లక్ష్మి తదితరులు మాట్లాడారు.





## మక్కువ ఉన్నా చదువుకు దూరం!

◆ ధ్రువప్రతాలు లేక విద్యార్థి ఇక్కట్లు

◆ రూ.10 వేలు డిమాండ్ చేస్తున్న దళారులు

◆ ప్రభుత్వం ఆదుకోవాలని తల్లిదండ్రుల అభ్యర్థన

**హైదరాబాద్, మహానాడు:** ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదని చిన్నారిని పాఠశాల నుండి సిబ్బంది ఇంటికి పంపేశారు. చిన్నారి ఇంట్లో పుట్టడంతో జనన ధ్రువీకరణ పత్రం ఆసుపత్రి సిబ్బంది మంజూరు చేయలేదు. విషయం తెలుసుకున్న దళారులు రూ.10 వేలు ఇస్తే పత్రాలు ఇప్పిస్తామని బేరమాడారు. ఈ సంఘటన హైదరాబాద్ సనత్‌నగర్‌లోని దాసారం బస్తీలో చోటుచేసుకుంది. అక్కడి గల అశోక్, మమత దంపతులకు శ్రీవిద్య(8) అనే కుమార్తె ఉంది. ఈ బాలికకు చదువుపై మక్కువ ఎక్కువ. అందరూ పిల్లల్లానే తాను చదువుకోవాలని అనుకుంది.. కానీ శ్రీవిద్యకు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికేట్ లేదని స్థానిక పాఠశాలలో చేర్చుకోలేదు.

తల్లిదండ్రులు శ్రీవిద్యను ఏడాది క్రితం స్థానికంగా ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించగా, ఇంటికి పంపేశారు. బర్త్ సర్టిఫికెట్ కోసం అధికారులను సంప్రదిస్తే.. పాప ఏ తారీఖున పుట్టిందనే వివరాలతో ఆసుపత్రి వారు ఇచ్చిన పత్రం తేవాలంటున్నారని.. పాప ఇంట్లోనే పుడితే ఆ పత్రం ఎలా నుంచి తేవాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.10 వేలు ఇస్తే అన్ని పత్రాలూ సిద్ధం చేస్తామని కొందరు చెబుతున్నారని.. అంత డబ్బు తమ దగ్గర లేదని శ్రీవిద్య తల్లిదండ్రులు విచారం వ్యక్తంచేశారు. అధికారులు దయ తలచి ఆ సర్టిఫికెట్లు ఇప్పించి తమ కూతురు చదువుకునేలా చూడాలని వేడుకున్నారు.





## రాష్ట్ర సచివాయ ఉద్యోగులకు.. చేనేత వస్త్రాలపై 50 శాతం డిస్కౌంట్!

◆ సెక్రటేరియట్‌లో 'ఆప్కో 'లో అమ్మకాలు

◆ డిస్కౌంట్ సేల్ కౌంటర్‌ను ప్రారంభించిన మంత్రులు సవిత, సంధ్యారాణి

◆ మహిళా దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు డిస్కౌంట్



**అమరావతి, మహానాడు:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల కోసం చేనేత వస్త్రాలను 50 శాతానికి డిస్కౌంట్ సేల్ ప్రారంభమైంది. గురువారం వెలగపూడిలో రాష్ట్ర సచివాలయంలో మూడో బ్లాక్ ఉన్న ఆప్కో షోరూమ్ లో చేనేత వస్త్రాలపై 50 శాతం తగ్గింపు ధరల ప్రత్యేక కౌంటర్ ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణితో కలిసి మంత్రి సవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆప్కో షో రూమ్‌లో వస్త్రాల నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ఎమ్మెల్యే బండారు శ్రావణి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రులు సవిత, గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ, అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చేనేత వస్త్రాల కొనుగోలుపై 50 శాతం మేర డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ డిస్కౌంట్ విక్రయాలను మూడు రోజుల పాటు గురు, శుక్రవారాల సహా ఈ నెల పదో తేదీ సోమవారం సాయంత్రం వరకు చేస్తున్నట్టు తెలిపారు. సచివాలయ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. చేనేత వస్త్రాలను వారానికోసారి ధరించుదామని, నేతన్నలకు అండగా ఉందామని మంత్రి సవిత కోరారు.

## 'అమరావతి'కి ఒక్క పైసా ప్రజల సొమ్ము ఖర్చు పెట్టం

◆ వైసీపీ ఎమ్మెల్సీల వ్యాఖ్యలపై మంత్రి నారాయణ మండిపాటు



**నెల్లూరు, మహానాడు:** అమరావతి నిర్మాణంలో ఒక్క పైసా కూడా ప్రజల సొమ్ము ఖర్చు పెట్టేది లేదని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ మరోసారి స్పష్టం చేశారు. రెండు రోజులుగా మాజీ సీఎం జగన్ తో పాటు వైసీపీ ఎమ్మెల్సీలు అమరావతిపై చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి నారాయణ మండిపడ్డారు. నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి నారాయణ గురువారం మీడియాతో మాట్లాడారు. అమరావతిపై జగన్‌తో పాటు ఆయన పార్టీ నాయకులు సైకోల్లా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ చూసి వైసీపీ నాయకులు ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు.

అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులంటూ మూడు ముక్కలాట ఆడిన జగన్... చివరికి ఏ ఒక్క నగరాన్ని కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఇప్పుడు మళ్లీ రాజధానిపై ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. హడ్కో, ఏడీబీ, ప్రపంచ బ్యాంకు ద్వారా రుణాలు తీసుకుని మాత్రమే అమరావతి నిర్మాణం చేస్తున్నామనే విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు..

అమరావతి నిర్మాణ పనులు ప్రారంభం అవుతుండటంతో వైసీపీ నేతలు సైకో మెంటాలిటీతో మాట్లాడుతున్నారని మండి పడ్డారు. ఇప్పటికే అమరావతిలో 50 వేల కోట్ల పనులకు టెండర్లు పిలిచామని...వాటిలో 27 టెండర్లు ఇప్పటికే తెరచి కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేస్తున్నట్టు తెలిపారు.

రాజధానిలో రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ పైప్ లైన్లు, పార్కులు పూర్తి కాగానే భూముల విలువ పెరుగుతుందన్నారు. ప్రభుత్వం వద్ద మిగిలిన భూమిని ధర పెరిగినప్పుడు అమ్మడం ద్వారా వచ్చే డబ్బులతో రుణాలు తీరుస్తామన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న ల్యాండ్ బ్యాంక్ ను కక్ష పూరితంగా ఆర్ - 5 జోన్గా మార్చివేసారని అన్నారు. సీఎం చంద్రబాబు అమరావతిని సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ గా డిజైన్ చేశారని గుర్తుచేశారు. అమరావతిపై వైసీపీ నేతలు ఎంత గింజుకున్నా ప్రయోజనం లేదన్నారు. మూడేళ్లలో అమరావతి పూర్తవుతుందని, జగన్ డ్రామాలతోనే ఆయన్ను 11 సీట్లకు పరిమితం చేశారని....ఆయన పాలన ఎలా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. బడ్జెట్ లో అమరావతికి కేటాయించిన 6 వేల కోట్లు ప్రజల ట్యాక్స్ ల నుంచి వచ్చే నిధులు కాదన్నారు. సీఆర్డీఏకు కేంద్రం గ్యారంటీ ఇచ్చిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వస్తాయని వాటిని మాత్రమే బడ్జెట్ లో చూపించారు తప్ప ప్రజల పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కాదన్నారు.

## ఏపీలో పెట్టుబడులకు సకల సౌకర్యాలు

◆ ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడి పెట్టాలని ఐటీబీ బెర్లిన్ - 2025 సదస్సులో కోరిన మంత్రి దుర్గేష్





**అమరావతి, మహానాడు:** ఏపీ పర్యాటకం పెట్టుబడులకు అనుకూలమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ జర్మనీ పర్యటనలో వెల్లడించారు. భారతదేశంలో మరే రాష్ట్రానికి లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో జల, రోడ్డు, వాయు రవాణా సౌకర్యాలతో పాటు అందమైన సహజ సిద్ధ ప్రకృతి ప్రదేశాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి దుర్గేష్ అన్నారు. మూడో రోజు జర్మనీ పర్యటనలో భాగంగా గురువారం బెర్లిన్ సదస్సులో ఏర్పాటు చేసిన ఏపీ స్టాల్ వద్ద మంత్రి కందుల దుర్గేష్, టూరిజం ఎండీ ఆమ్రపాలి కాట వివిధ దేశాల ప్రతినిధులకు రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. నూతన పర్యాటక పాలసీ, రాష్ట్ర పర్యాటక ప్రాంతాల సమగ్ర సమాచారాన్ని తెలిపే పుస్తకాలను విదేశీ ప్రతినిధులకు పంపిణీ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవులు, సుదీర్ఘ సముద్ర తీరం, చారిత్రాత్మక ప్రదేశాలు, కోటలు, దట్టమైన అడవులు, ఎత్తైన కొండలు, చల్లని ప్రదేశాలు, సజీవ నదులు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, ప్రఖ్యాతి పొందిన బౌద్ధారామాలు సహా రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలు చాలా ఉన్నాయని మంత్రి దుర్గేష్ పారిశ్రామికవేత్తలకు తెలిపారు. అంతేగాక సంస్కృతీ సాంప్రదాయాలకు తమ ప్రాంతంలో పెద్దపీట వేస్తామన్నారు. పర్యాటక ప్రాంతాల్లో లగ్జరీ రిసార్ట్స్, వెల్ నెస్ సెంటర్స్, బహుళ అంతస్తు హోటళ్లు, విభిన్న పర్యాటకానికి, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక వసతులకు పెద్దపీట వేయాలని తమ ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు.

ఈ క్రమంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని చెబుతూ నూతన పర్యాటక పాలసీ విధి విధానాలు, ఇన్వెస్టర్లకు అందించే రాయితీల వివరాలు వెల్లడించి ఏపీ పర్యాటక రంగంలో పెట్టుబడులను ఆహ్వానించారు. పెట్టుబడులకు ఇదే సరైన సమయమని తమ ప్రభుత్వంతో భాగస్వామ్యమై ముందుకు వెళ్దామని కోరారు. ఇన్వెస్టర్లకు అన్ని విధాల అనువైన వాతావరణం ఏపీలో ఉందన్నారు. ఏపీలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ కోరారు.

## శ్రీ అర్ధనారీశ్వర స్వామి విగ్రహం నిర్మాణానికి భూమిపూజ

◆ జగన్‌ను ఆహ్వానించిన పీఠాధిపతులు



**తాడేపల్లి, మహానాడు:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్‌ను కలిసి భూమిపూజకు కర్ణాటకలోని విజయనగర జిల్లా నందీపుర పీఠాధిపతులు ఆహ్వానించారు. ఏప్రిల్ 30 న నందీపురలో ప్రపంచంలోనే ఎత్తయిన 108 అడుగుల శ్రీ అర్ధనారీశ్వర స్వామి విగ్రహానికి భూమిపూజ కార్యక్రమం జరుగునుంది. పీఠాధిపతులు డాక్టర్ మహేశ్వర స్వామీజీ (నందీపుర పుణ్యక్షేత్రం), ష.బ్ర. పంచాక్షరి శివాచార్య స్వామీజీ (హీరే మఠం, బెన్నిహళ్ళి), జడేశ్వర తాత (శక్తి పీఠం, వీరాపుర), కృష్ణపాద స్వామీజీ (భుజంగ నగర్, సండూర్) జగన్‌కు ఆహ్వానపత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్సీపీ ఎంఎల్‌సీ డాక్టర్ ఎ.మధుసూదన్, రామచైతన్య (ఫౌండర్, అర్ధనారీశ్వర ఫౌండేషన్), వీరేష్ ఆచార్య (కో-ఫౌండర్, అర్ధనారీశ్వర ఫౌండేషన్) పాల్గొన్నారు.

## ఆర్థిక నేరాల కేసులలో సత్వర న్యాయం చేయాలి

◆ ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**అమరావతి, మహానాడు:** ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక నేరాలకు పాల్పడిన మోసగాళ్ళ విషయంలో విచారణ వేగంగా చేసి బాధితులందరికీ సత్వర న్యాయం జరిగేలా చూడాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో పాల్గొని జీరో అవర్‌లో "ఆర్థిక నేరాల" అంశాన్ని లేవనెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సామాన్య మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల ఉన్నత విద్య కోసం, ఇంటి నిర్మాణం, వివాహాల, ఇతర అవసరాల కోసం తమ డబ్బును మోసగాళ్ళ చేతిలో చిట్టీలు, స్కీం ల రూపంలో పెట్టి మోసపోతున్నారని, దీని వలన ప్రజలు ఆర్థికంగా నష్ట పోవటమే కాకుండా, కొన్ని సార్లు బలవన్మరానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

5

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025


# పీడీఎస్ బియ్యం అక్రమార్కులపై చర్యలు

◆ మంత్రి నాదెండ్ల మనోహర్

**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో 2019–2024 మధ్య పౌరసరఫరాల దాడులలో 76854 మెట్రి టన్నుల పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తూ అరెస్ట్ అయిన వారి సంఖ్య 9,664 మంది. ఇందులో 148 మందిని రెండుసార్లు కంటే ఎక్కువ అరెస్ట్ చేశారు. అంతేకాకుండా వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు జిల్లా సెక్షన్స్ కోర్టు ఆదేశాల ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని శాసన సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆహార పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇంకా, ఆయన ఏమన్నారంటే.. క్షేత్రస్థాయిలో ఇప్పటికీ రేషన్ బియ్యం కోసం అనేక కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. ప్రతినెల ఉచితంగా బియ్యాన్ని ప్రజలకు ప్రభుత్వం అందజేస్తుంది. గత ప్రభుత్వం రేషన్ బియ్యం విషయంలో ఆర్గనైజ్డ్ మాఫియాను తయారుచేసింది. గత ప్రభుత్వా ఐదు సంవత్సరాల్లో 76,854 మెట్రి టన్నుల బియ్యం సీజ్ చేస్తే..... కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలలో 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేసింది. అంతేకాకుండా వారిపై క్రిమినల్ కేసులతో పాటు పిడి యాక్ట్ పెట్టింది. బియ్యంతో పాటు 512 వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. కాకినాడలో 50 వేల మెట్రిక్ టన్నులు బియ్యం జప్తు. ఇందులో 25 వేల 386 మెట్రిక్ టన్నులు పిడిఎస్ బియ్యంగా గుర్తింపు.



13 సంస్థలపై కేసు నమోదు. వ్యవస్థ ప్రక్షాళన లో భాగంగా కాకినాడ పోర్ట్ ప్రాంతంలో చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. త్వరలో క్యూఆర్ కోడ్ తో కొత్త రేషన్ కార్డులు అందిస్తాం. ప్రతి గోడౌన్ వద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో నిఘా. దీని ద్వారా గోడౌన్ లో ఎంత సరుకుంది... ఎంత సరుకు లోడ్ అవుతుంది అనే సమాచారం తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది.





# దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగితేనే దేశాభివృద్ధి

◆ కేంద్ర మాజీ మంత్రి మురళీధరన్



**విజయవాడ, మహానాడు:** దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు జరిగితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని కేంద్ర మాజీ మంత్రి మురళీ ధరన్ పేర్కొన్నారు. విజయవాడ స్టెల్లా కళాశాల ఆడిటోరియంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అంశంపై గురువారం జరిగిన సెమినార్ లో మురళీ ధరన్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భారతదేశం ప్రపంచంలో శక్తి వంతమైనది. భారత దేశం ఆర్థిక వ్యవస్థలో 5వ స్థానంలో ఉంది. కోవిడ్ సమయంలో అభివృద్ధి చెందిన దేశాలు సైతం వాక్సిన్ కోసం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ భారత దేశం వాక్సిన్‌లని అభివృద్ధి చెందిన దేశాలకి సైతం అందించగలిగాం.

ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూశాయి. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అభివృద్ధి పథంలో దేశం ముందికి వెళ్తుంది. జపాన్ దేశం లో ఎక్కువ యువతకి ఉద్యోగ అవకాశాలు లేవు. సరైన శిక్షన అవసరమని ముళీధరన్ అభిప్రాయపడ్డారు.

భారత దేశంలో ఎక్కువ నైపుణ్యత కలిగిన యువత ఉన్నారు. ప్రపంచ దేశాలు అన్ని నైపుణ్యం కలిగిన యువత కోసం చూస్తున్నారు. అందుకే ప్రధాని మోదీ భారత దేశం నైపుణ్యం కలిగిన యువత ఉన్నారని చెప్తారు. దేశ అభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి.

యువతలో స్కిల్ అనేది ముఖ్య పాత్ర వహిస్తుంది. వన్ నేషన్ వన్ ఎలక్షన్ భారత దేశం అభివృద్ధి చెందటానికి ఎంతగానో ఉపయోగ పడుతుంది. ప్రతి రాష్ట్రంలో ఎన్నికల వల్ల కోడ్ అమలులోకి రావటం అభివృద్ధి వెనకకు వెళ్ళిపోతుం దన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ పై మాజీ రాష్ట్రపతి రాం నాథ్ కోవింద్ ఆధ్వర్యంలో ఒక కమిటీ అధ్యయనం చేస్తోంది.

ఈ కార్యక్రమంలో తక్షశిల ఐఏఎస్ అకాడమీకి చెందిన దుర్గా ప్రసాద్, స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ జసింత, ప్రోగ్రాం కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణ రాజు, ప్రోగ్రాం కో కన్వీనర్ వల్లూరు జయ ప్రకాష్ నారాయణ, ఏపీ విద్యార్థుల కార్యక్రమం ఇన్‌ఛార్జి ఎన్.రమేష్ నాయుడు, విష్ణు వర్ధన్ రెడ్డి, రైట్స్ కంప్యూటర్ ఇనిస్టిట్యూట్ అధినేత సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

# 22ఎ నుండి ప్రయివేట్ భూముల తొలగింపు!

◆ గ్రామకంఠంలోని భూములకు కూడా విముక్తి

◆ అభ్యంతరం లేని అక్రమిత భూముల క్రమబద్ధీకరణకు ఏడాది సమయం

◆ శాసనసభలో మంత్రి అనగాని సత్యప్రసాద్



**అమరావతి, మహానాడు:** పేదలకు, నిజమైన భూ యజమానులకు న్యాయం జరగలానే లక్ష్యంతో 22 ఏ నుండి ప్రయివేట్ భూములను తొలగించాని నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇందుకోసం గత నెల 17వ తేదీన మెమోను విడుదల చేశామని, నిషేధ ఆస్తుల జాబితా నుండి ప్రయివేట్ భూములను ఎలా తొలగించాలనేది స్పష్టంగా అందులో తెలిపామని చెప్పారు. ఈమేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. గురువారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధాన మిస్తూ అలాగే పంచాయతీల్లో గ్రామ కంఠాల్లో ఉండే ప్రయివేట్ వ్యక్తుల ఆస్తులను కూడా నిషేధ జాబితా నుండి తొలగించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

2015లోనే అప్పటి కూటమి ప్రభుత్వం 187 జీవోను ఇచ్చిందని, పంచాయతీలకు చెందిన సామాజిక ఆస్తులు మినహా మిగిలిన ఆస్తులను నిషేధ జాబితా నుండి తొలగిస్తూ ఆ జీవో ఇచ్చారని చెప్పారు. అయితే గత ప్రభుత్వం రీ సర్వే చేసిన సందర్భంలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో 4,157 ఎకరాలను నిషేధ జాబితాలో పెట్టారని, దీని వల్ల సామాన్యులు చాలా ఇబ్బందులు పడ్డారని చెప్పారు. ఈ నేపథ్యంలో గ్రామ కంఠంలోని ప్రయివేట్ ఆస్తులను పరిశీలించి నిషేధ జాబితా నుండి తొలగించాలని నిర్ణయించినట్లు చెప్పారు.

కాగా రాష్ట్ర వ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇల్లు కట్టుకున్న వారికి క్రమబద్ధీకరణ చేస్తున్నామని, వీరికి ఏడాదిపాటు సమయం ఇచ్చామని, వీరంతా ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. గత ప్రభుత్వం భూముల రీ సర్వేను ఫార్సుగా మార్చిందని, సరిహద్దు రాళ్లపై, పాస్ పుస్తకాలపైన బొమ్మలు వేసుకోవాలనే కాంక్షతో రీ సర్వేను తప్పుల తడకగా మార్చిందని విమర్శించారు. కానీ తమ ప్రభుత్వం భూ యజమానులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో సమగ్రంగా రీసర్వే చేయిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు.

# రూ.23.1 కోట్లతో 'స్టేట్ క్లైమేట్ సెంటర్ ఫర్ సిటీస్'

◆ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్

**అమరావతి, మహానాడు:** భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం అందించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సుస్థిర పట్టణాభివృద్ధి దిశగా ముందుకు సాగుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ పట్టణ వ్యవహారాల సంస్థలతో సీఐటీఐఐఎస్ 2.0 వాతావరణ చర్యా ప్రణాళికను అమలు చేయడానికి త్రిపాక్షిక అవగాహన ఒప్పందంపై సంతకాలు చేసింది.

రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఘనంగా నిర్వహించిన 12వ ప్రాంతీయ 3ఆర్, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో వృత్తాకార ఆర్థిక వ్యవస్థ ఫోరమ్ వేదికగా ఈ చారిత్రాత్మక ఒప్పందం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రధాన కార్యదర్శి, ఎస్. సురేష్ కుమార్, కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ సమక్షంలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.




ఈ ఒప్పందం ఫలితంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి 23.1 కోట్ల గ్రాంటు లభించనుంది. ఈ నిధులతో 'స్టేట్ క్లైమేట్ సెంటర్ ఫర్ సిటీస్' స్థాపన, రాష్ట్ర, నగర స్థాయిలో క్లైమేట్ డేటా ఒబ్జర్వేటరీల నిర్మాణం, డేటా ఆధారిత వాతావరణ చర్యా ప్రణాళికల రూపకల్పన, తక్కువ కార్బన్ నగరాల నిర్వహణ చట్రం ద్వారా మున్సిపల్ అధికారుల సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# లోకేష్ కృషి వల్లే ఏపీకి ఆర్సెలర్ మిట్టల్ ఉక్కు పరిశ్రమ

◆ మంత్రి టి.జి భరత్



**అమరావతి, మహానాడు:** రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. అసెంబ్లీలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ కృషి వలనే రాష్ట్రంలోని అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలంలో.. పేరుగాంచిన ఆర్సెలర్ మిట్టల్ & నిప్పాన్ స్టీల్ పరిశ్రమ రాబోతుందన్నారు. రూ.1,47,162 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో (1వ దశలో రూ.61,780 కోట్లు, 2వ దశలో రూ.85,382 కోట్లు) ఈ పరిశ్రమ ఏర్పాటవుతుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. 17.8 ఎంటిపిఏ సామర్థ్యంతో 2 దశలలో (మొదటి దశలో 7.3 ఎంటిపిఏ & 2వ దశలో 10.5 ఎంటిపిఏ) ఏకీకృత ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటు చేస్తారన్నారు.

అప్పట్లో ఒడిశాలో పరిశ్రమ పెట్టాలన్న ఆలోచన వారికి ఉండిం దన్నారు. 2018లో దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో మంత్రి నారా లోకేష్.. ఆదిత్య మిట్టల్‌ను కలిసి పరిశ్రమను ఏపీలో పెట్టాలన్న దానిపై చర్చించినట్లు మంత్రి టి.జి భరత్ చెప్పారు. అయితే 2019లో ప్రభుత్వం మారడంతో ఏపీలో పరిశ్రమ పెట్టాలని ప్రభుత్వం కోరినా అది జరగలేదన్నారు. తీరా మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వం రావడంతో ఒకే ఒక్క జూమ్ కాల్‌లో లోకేష్.. ఆదిత్య మిట్టల్‌తో మాట్లాడి ఏపీలో పరిశ్రమను పెట్టేలా ఒప్పించారని మంత్రి టి.జి భరత్ తెలిపారు.

చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఎన్డీయే ప్రభుత్వం ఉందన్న నమ్మకంతోనే పరిశ్రమ రాష్ట్రానికి వచ్చిందన్నారు. దేశంలోనే అతిపెద్ద ఉక్కు పరిశ్రమగా ఇది నిలిచిపోతుందన్నారు. ఇటీవల జరిగిన దావోస్ సదస్సులో కూడా ఏపీని బాగా ప్రమోట్ చేశామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు వివరించినట్లు మంత్రి తెలిపారు.

# మహిళా అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

◆ మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**అమరావతి, మహానాడు:** ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళల అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందిస్తున్న సేవలు, అమలు తీరును సమీక్షించారు. మహిళలు స్వయం సాధికారత సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. 26 జిల్లాల అధికారులు మహిళా దినోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాల గురించి అధికారులను వివరణాత్మకంగా సమీక్షించి,



ఇంకా సమర్థంగా అమలు చేయాల్సిన మార్గదర్శకాలను సూచించారు.

"మహిళల హక్కులు, అభివృద్ధి కోసం ప్రభుత్వం అంకితభావంతో పని చేస్తోంది. ప్రతి మహిళ ఆర్థికంగా, సమాజంలో బలపడేలా చొరవ చూపాలని" పిలుపునిచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల అధికారులూ పాల్గొన్నారు.

వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు..

ఈ సంధర్భంగా రాయదుర్గం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి - సమస్యలపై మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చిన మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు..




# అమరావతిలో రూ.100 కోట్లతో యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రం

◆ ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖం

◆ 'ఆయుష్'పై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం


◆ ఐదేళ్లలో శాప్ కింద రాష్ట్రానికి కేవలం రూ.71 కోట్లు కేంద్రం నుండి తెచ్చారు

◆ కూటమి ప్రభుత్వం మూడు నెలల్లోనే రూ.28 కోట్లు తెచ్చింది

**అమరావతి, మహానాడు:** కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన యోగా, ప్రకృతి వైద్య పరిశోధనా కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకరించారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గురువారం అసెంబ్లీలో ఆయుష్ విభాగంపై సభ్యులడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ 2018లోనే కేంద్రం మంజూరు చేసిన ఈ పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు అప్పటి ఎన్డీయే ప్రభుత్వం గన్నవరం నియోజక వర్గంలోని కొండపావులూరు గ్రామంలో 25 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసి ఆ 25 ఎకరాల స్థలాన్ని జగనన్న కాలనీ కోసం కేటాయించడం దారుణమన్నారు.

ప్రస్తుతం ఈ యోగా నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని రూ. 100 కోట్ల తో రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సీఎం చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారని, ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఎంతో కాలంగా మునులు, రుషులు, వాళ్ల అనుభవాల్ని రంగరించి, మేళవించి అద్భుతమైన సాంప్రదాయ వైద్య విధానాన్ని మనకందించారని, దీని ప్రాముఖ్యతను గుర్తించిన ప్రధాని నరేంద్రమోడీ ఆయుర్వేద, యోగా, హెూమియోపతి, యునాని(ఆయుష్) శాఖను ప్రత్యేకంగా ప్రారంభించారన్నారు. మన దేశమే కాకుండా 46 దేశాల్లో ఈ వైద్య విధానాన్ని పాటిస్తున్నారని, యోగా ప్రాధాన్యతను గుర్తించిన 120 దేశాలు ప్రతి ఏడాదీ జూన్ 21న యోగా దినాన్ని నిర్వహిస్తున్నారంటే మన సాంప్రదాయ వైద్యానికి ఎంతటి గుర్తింపు ఉందో అర్థమవుతోందన్నారు.

అయితే, మన రాష్ట్రంలో మాత్రం పరిస్థితులు ఇందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు. ఆయుష్ విభాగం పనితీరుపై గత ప్రభుత్వం సమీక్షించిన దాఖలాలు లేవు సరికదా, వైద్య ఆరోగ్య శాఖలో అటువంటి విభాగమొకటి ఉందా అని మాజీ సీఎం జగన్ అని అడిగిన సందర్భాలున్నాయన్నారు. భారతీయ సంప్రదాయ వైద్యమైన ఆయుర్వేద, యోగా, నేచురోపతిని



ప్రపంచమంతా అనుసరిస్తున్న సమయంలో గత ప్రభుత్వ వైఖరి కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో ఈ విధానాలు పూర్తి నిర్లక్ష్యానికి గుర య్యాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అనేక చోట్ల ఉన్న ఆయుష్ డిస్పెన్సరీలను సిబ్బంది, నిధుల కొరత కారణంగా మూతవేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇందుకు వైసిపి ప్రభుత్వం అనుసరించిన నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు.

ఆరోగ్య వైద్య శాఖలో విభాగమైన ఆయుష్ పై గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కానీ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కానీ సమీక్ష కూడా నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ శాఖపై సమీక్షలు నిర్వహించి సంప్రదాయ వైద్య పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించారన్నారు. ఆయుష్ విభాగంలో రాష్ట్ర వ్యాప్తంగా 327 వైద్యాధికారుల పోస్టులు ఉంటే అందులో 67 ఖాళీగా ఉన్నాయని చెప్పారు.

హెూమియో వైద్య విధానంలో 190 పోస్టులు వుంటే అందులో 62 ఖాళీగా వున్నాయని చెప్పారు. యునాని విభాగంలో 73 పోస్టులకు 32 ఖాళీలు వున్నాయన్నారు. పారామెడికల్ సిబ్బంది విషయంలో 323 పోస్టులు మంజూరు కాగా 272 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. మొత్తంగా 1087 పోస్టులు మంజూరు కాగా 458 (దాదాపు 40 శాతం మేర) ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ తేడాలను సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందన్నారు.

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 138 పోస్టుల భర్తీకి ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని మంత్రి వెల్లడించారు. ఆయుర్వేద వైద్య విభాగంలో 72 మంది వైద్యాధికారుల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయగా దానికి 62 మంది ఇప్పటికే ఎంపికయ్యారని, వారు త్వరలోనే విధుల్లో చేరనున్నారని చెప్పారు. హెూమియో విభాగంలో 53 పోస్టులకు 52 మంది ఎంపికయ్యారని, యునాని విభాగంలో 26 పోస్టులకు గాను 15 మంది ఎంపికయ్యారని వివరించారు. ఈ విధంగా ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేసి ఈ వైద్య విభాగాన్ని మరింత పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ఆయుష్ విభాగాన్ని నిర్లక్ష్యం చేయడమే కాకుండా పూర్తిగా చంపేయడానికి గత ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. ఆయుష్ విభాగానికి గత ఐదేళ్ళ కాలంలో కేంద్రం నుండి స్టేట్ యానువల్ యాక్షన్ ప్లాన్ కింద రాష్ట్రానికి అందిన నిధులు కేవలం రు.71 కోట్లు మాత్రమేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మూడు నెలల్లోనే రూ.28 కోట్లు శాప్ కింద కేంద్రం నుంచి తీసుకొచ్చిందన్నారు.

ఈ శాఖ అభివృద్ధి కోసం రాష్ట్రం నుండి ఎటువంటి ప్రతిపాదనలు పంపటం కానీ, కేంద్రం నుండి నిధులు రాబట్టే ప్రయత్నం కానీ గత ప్రభుత్వం చేయలేదంటే ఆయుష్ పై ఎంత నిర్లక్ష్యం గా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చున్నారు. కేంద్రం నిధులివ్వటానికి సిద్ధంగా ఉన్నప్పటికీ వాటిని అందుకుని సద్వినియోగం చేసేందుకు గత ప్రభుత్వం ఎటువంటి ఆలోచనా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొదటి మూడు నెలల కాలంలోనే రూ.28 కోట్ల కేంద్ర నిధులతో ఈ శాఖను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందని చెప్పారు. కాకినాడలో రు.7.2 కోట్ల నిధులతో 60 బెడ్ల సామర్థ్యం వున్న ఆస్పత్రిని, విశాఖలో రు.8.3 కోట్ల వ్యయంతో 80 బెడ్ల సామర్థ్యం కలిగిన ఆస్పత్రిని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు.

ఆయుర్వేద విశ్వవిద్యాలయం స్థాయిలోనే 2018లో కేంద్రం మన రాష్ట్రానికి యోగ, నేచురోపతి పరిశోధనా కేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. ఇటీవల కేంద్ర మంత్రి తనకు ఫోన్ చేసి రాష్ట్రానికి మంజూరైన పరిశోధనా కేంద్రానికి ప్రధాని నరేంద్రమోడీ భూమిపూజ చేసేందుకు కార్యక్రమం రూపొందిస్తున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి ఇందుకు అనువైన సమయాన్ని సూచించాలని తనను కోరారన్నారు. 2018లో మంజూరైన దీని కోసం గన్నవరం నియోజకవర్గంలోని కొండపావులూరు గ్రామంలో అప్పటి ఎన్డిఎ ప్రభుత్వం 25 ఎకరాల భూమిని కేటాయిస్తే, తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వ ఆ ప్రతిపాదనను బుట్టదాఖలా చేసిందన్నారు.

ఈ అంశంపై ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు నాడు కేటాయించిన స్థలం జగనన్న ఇళ్ల కాలనీలకు అప్పటి ప్రభుత్వం కేటాయించిందని తనకు చెప్పారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్ళినపుడు ఈ కేంద్రాన్ని రాజధాని అమరావతిలోనే రూ.100 కోట్లతో ఏర్పాటు చేద్దామన్నారని, అందుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారని వివరించారు.

ఆయుర్వేదం, హెూమియో ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరతపై అసెంబ్లీలో సభ్యులడిగిన ప్రశ్నకు వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానమిస్తూ రాష్ట్రంలో మూడు ఆయుష్ ఆస్పత్రులు, ఒక ఆయుర్వేద బోధనా ఆస్పత్రి, రెండు మినీ ఆయుర్వేద ఆస్పత్రులు, మూడు హెూమియో బోధనా ఆస్పత్రులు పనిచేస్తున్నాయని తెలిపారు. అయితే వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా 20 ఆయుర్వేద, 16 హెూమియో ఆస్పత్రులు పని చేయడం లేదన్నారు.

ఇటీవల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా 67 ఆయుర్వేద వైద్య అధికారుల పోస్టులకు కాను, 50 మంది వైద్యాధికారులు నియమితులయ్యారన్నారు. 20 ఆయుర్వేద, 16 హెూమియో ఆస్పత్రులు సిబ్బంది కొరత కారణంగా పనిచేయడం లేదనీ , ఈ ఆస్పత్రులలో ఖాళీల భర్తీ కోసం అవసరమైన అనుమతులు తీసుకుని నియామక ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామనీ చెప్పారు. జాతీయ ఆయుష్ మిషన్ నిధులతో 126 ఆయుష్ డిస్పెన్సరీలను పునరుద్ధరించామని, అవి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లుగా ప్రస్తుతం సేవలందిస్తున్నాయని వివరించారు. ప్రజలకు ఆయుష్ వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025

## 10 నుంచి 'బీసీ' స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ

**- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**అమరావతి:** ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున రాష్ట్రంలో అమలవుతున్న బీసీ సంక్షేమ పథకాల యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి తెలిపారు. ఈ నెల పదో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉమ్మడి గుంటూరు-కృష్ణా, ఉభయ గోదావరి పట్టభద్రులు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గత నెల మూడో తేదీ నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన విషయం తెలిసిందేనన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం, ఫలితాలు కూడా వెలువడడంతో ఎన్నికల కోడ్ ముగిసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించినట్లు మంత్రి సవిత తెలిపారు. ఎన్నికల కోడ్ ఫలితంగా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలోనూ బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లకు దరఖాస్తుల స్వీకరణ నిలిపేశామన్నారు.

తాజాగా ఎన్నికల కోడ్ ముగియడంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, కృష్ణా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన లబ్ధిదారులంతా ఈ నెల పదో తేదీ నుంచి ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా రుణాల మంజూరుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి, త్వరితగతిన యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి సవిత ఆ ప్రకటనలో కోరారు.



## శ్రీపాల్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

**హైదరాబాద్, మహానాడు:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్-ఖమ్మం-నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి. ఈ సందర్భంగా శ్రీపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.




ఎమ్మెల్సీ జనసేన అభ్యర్థిగా శ్రీ నాగబాబు గారు నామినేషన్ దాఖలుకి అవసరమైన పత్రాలు సిద్ధం చేస్తున్నారు. శ్రీ నాగబాబు గారి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది శాసనసభ్యులు సంతకాలు చేశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, లోకం నాగ మాధవి, ఆరణి శ్రీనివాసులు, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్, పత్సమట్ల ధర్మరాజు, అరవ శ్రీధర్ , బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ సంతకాలు చేశారు








వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి..

ఈ సంధర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి - సమస్యలను మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చిన మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి..



జనం గుండె చప్పుడు


# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ‖ శుక్రవారం 07, మార్చి 2025 ‖













మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన "ప్రపంచ చరిత్ర" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఎంపి దగ్గుబాటి పురందరేశ్వరి, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రంగాల ప్రముఖులు





















జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

08

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 ||

## శ్రీవిద్య గొప్పగా రాణించాలి

### - ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి ట్వీట్



**హైదరాబాద్:** సనత్ నగర్, దాసారం బస్తీకి చెందిన మల్లెల శ్రీవిద్య సమస్య పత్రికల ద్వారా నా దృష్టికి వచ్చింది. డీఈవో శ్రీమతి రోహిణి ద్వారా విచారణ జరిపించాను. శ్రీవిద్య పాఠశాలకు హాజరుకాలేక పోవడానికి ఆధార్ కార్డు లేకపోవడం కారణం కాదు అని తేలింది. కుటుంబ కారణాల వల్ల ఆమె పాఠశాలకు దూరమైంది. నా ఆదేశాల మేరకు అధికారులు తిరిగి శ్రీవిద్యను పాఠశాలలో చేర్పించారు. తను మంచి చదువులు చదివి భవిష్యత్‌లో గొప్పగా రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

నిరం'తరం'



షావుకారి జానకి కూతురు యజ్ఞప్రభ, యజ్ఞప్రభ కూతురు వైష్ణవి, వైష్ణవి కూతురు అదితి, అదితి కూతురు మేఘన, 91 సంవత్సరాల జానకి. ఒకటి రెండు తరాలు చూడటమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో ఇన్ని తరాలు చూడటం చాలా గొప్ప విషయం



అసెంబ్లీ సమావేశాలు ముగిసిన అనంతరం గురువారం మధ్యాహ్నం గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఐటి, ఎలక్ట్రానిక్స్, విద్యా శాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి!

- 15 మందికి గాయాలు
- క్షతగాత్రులను పరామర్శించిన కలెక్టర్

**ఏలూరు, మహానాడు:** హైదరాబాద్ నుంచి కాకినాడ వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు చోదిమెళ్ళ బ్రిడ్జి వద్ద లారీని ఢీకొంది. బస్సులోని ప్రయాణికుల్లో ముగ్గురు మృతి చెందగా, 15 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరామర్శించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. వారితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని జీజీహెచ్ వైద్యులను కలెక్టర్ ఆదేశించారు.

## తెలుగు రాష్ట్రాల ఎమ్మెల్సీలకు మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ:** తెలుగు రాష్ట్రాల్లో గెలుపొందిన ఎమ్మెల్సీలకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'ఏపీలో గెలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందనలు. కేంద్రం, ఏపీలోని ఎన్డీయే ప్రభుత్వం



నిరంతరం ప్రజలకు సేవ చేస్తునే ఉంటుంది' అని పేర్కొన్నారు. అలాగే 'తెలంగాణ ప్రజలు నన్ను ఆశీర్వదించినందుకు ధన్యవాదాలు. తెలంగాణ బీజేపీలో కొత్తగా ఎన్నికైన మా అభ్యర్థులకు అభినందనలు' అని పేర్కొన్నారు.

## తిరుమల భక్తులకు భోజనంలో ఇక వడ

- స్వయంగా వడ్డించిన చైర్మన్ బీఆర్ నాయుడు

**తిరుపతి:** తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, అన్నప్రసాదం మెనూలో అదనంగా గారెలను చేర్చాలని నిర్ణయించారు. ఈ ఆలోచనను సీఎం దృష్టికి తీసుకెళ్లి, ఆయన అంగీకారంతో గారెలను ప్రవేశపెట్టారు. నాణ్యమైన దినుసులతో భక్తులకు రుచికరమైన అన్నప్రసాదాలను అధికారులు వడ్డిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10:30 నుండి సాయంత్రం 4 గంటల వరకు సుమారు 35,000 గారెలను భక్తులకు వడ్డిస్తున్నారు. భవిష్యత్తులో ఈ సంఖ్యను మరింతగా పెంచి, భక్తులకు రుచికరమైన భోజనం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు.



# విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులకు 100శాతం సాయం అందించండి!

- కేంద్రమంత్రి ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భేటీ

**అమరావతి:** కేంద్ర పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢిల్లీలో కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులపై సిఎం... కేంద్రమంత్రితో చర్చించారు. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి, ఆర్థిక వృద్ధిని పెంపొందించడానికి, పట్టణాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టులు కీలకమైనవి.

ఈ ప్రాజెక్టులను వెంటనే ఆమోదించి, ఆర్థిక సాయం అందించండి. మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, పట్టణీకరణ





సవాళ్లను పరిష్కరించడంలో ఈ ప్రాజెక్టుల ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక నోట్ ను కేంద్రమంత్రికి సమర్పించారు. రాష్ట్ర విభజనకు ముందు హైదరాబాద్ మెట్రో రైలు ఆమోదించారు. విశాఖపట్నం, విజయవాడ ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని సిఎం తెలిపారు.

కీలక పారిశ్రామిక కేంద్రమైన విశాఖపట్నంలో రోజురోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తికానుందున, అప్పట్లోగా మెట్రో కారిడార్‌ను జాతీయ రహదారులతో అనుసంధానించడం చాలా ముఖ్యం. మొదటి దశలో ప్రధాన పట్టణ కేంద్రాలను అనుసంధానించడం లక్ష్యం. తర్వాత విమానాశ్రయం వరకు విస్తరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు.

రాజధాని అమరావతికి గేట్ వే గా విజయవాడ మెట్రో వ్యవస్థ ఏర్పాటుతో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయాలని నిర్ణయించాం. విజయవాడ పరిసరాల్లో ఆర్థిక వృద్ధికి తోడ్పడటానికి ఇది చాలా అవసరం. నగరంలో పెరుగుతున్న రవాణా అవసరాలను తీర్చడానికి ఈ



ప్రాజెక్టును ప్రాధాన్యమైనదిగా పరిగణించాలని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందులను ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటోంది... మెట్రో ప్రాజెక్టులను స్వతహాగా నిర్మించే పరిస్థితుల్లో లేదు.

రాష్ట్రాభివృద్ధిలో కీలకమైన ఈ రెండు మెట్రో రైలు ప్రాజెక్టులకు 100% కేంద్ర సహాయాన్ని అందించాల్సిందిగా సిఎం కోరారు. సకాలంలో ప్రాజెక్టును గ్రౌండ్ చేసేందుకు ఫేజ్- 1 అనుమతులు, భూసేకరణకు కేంద్రం మద్దతు ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. ఈ ప్రాజెక్టులు వల్ల వాయు కాలుష్యం తగ్గడమేగాక, ట్రాఫిక్ సమస్య పరిష్కారమై దీర్ఘకాలిక ఆర్థికవృద్ధికి దోహదపడుతుందని కేంద్రమంత్రి ఖట్టర్ కు సీఎం చంద్రబాబు వివరించారు.

# ఇంటర్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్

- ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం
- విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు స్కూల్ వెల్ నెస్ టీమ్స్
- విద్యార్థుల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్
- ప్రైవేటు యాజమాన్యంపైనా బాధ్యత ఉంది
- ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి
- విద్యార్థుల ఆత్మహత్యలపై మండలిలో నారా లోకేష్

**అమరావతి, మహానాడు:**

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలపై మండలి సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు ఎవరికైనా బాధాకరం. నేను విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఎవరైనా విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడితే.. సొంత పిల్లలకు జరిగినట్లుగా భావించి అధికారులు స్పందించాలని చెప్పాను.

మానవతా కోణంలో మనం ఆలోచించాల్సిన అవసరం ఉందని చాలా స్పష్టంగా చెప్పాను. విద్యార్థుల ఆత్మహత్యలకు ఒక ప్యాట్రన్ అంటూ ఏమీ లేదు. 2016లో ఆరుగురు చనిపోతే..2019లో నలుగురు చనిపోయారు. 2021లో ఏడుగురు చనిపోయారు. 2022లో 12 మంది, 2023లో 17మంది, 2024లో ఆరుగురు చనిపోయారు. విద్యార్థుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయనే ప్యాట్రన్ లేదు. అయితే ఆత్మహత్యలు జరుగుతున్నాయి. కాదని ఎవరూ అనడం లేదు. ఇవన్నీ ఇంటర్ విద్యలో చోటుచేసుకున్నవి. టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయానికి వస్తే.. ఒకేడాది ఒకరిద్దరు చనిపోతే, మరో ఏడాది 11 మంది, మరో ఏడాది ఒకరు చనిపోయారు. దీనికి ప్యాట్రన్ లేదు. యూనివర్సిటీల్లో కూడా ఆత్మహత్యలు జరిగాయి. 2014 నుంచి 18 మంది చనిపోయారు.

### స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటు

స్కూల్ వెల్‌నెస్ టీమ్స్ ఏర్పాటుచేసి ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు ఓరియంటేషన్ ఇచ్చి ఎర్లీయర్ సింప్టమ్స్ ను క్యాచ్ చేయాల్సిన అవసరం ఉంది. కేవలం జూనియర్ కాలేజీల నుంచి విశ్వవిద్యాలయాల వరకే కాకుండా పాఠశాల విద్యలో కూడా లైంగిక



వేధింపుల ఆరోపణలు వస్తున్నాయి. స్కూల్ ఎడ్యుకేషన్ లో కూడా సుమారు 280 మంది కౌన్సిలర్స్ ను నియమించాం. వారు ఉపాధ్యాయులకు కూడా శిక్షణ ఇచ్చి ఎర్లీ సింప్టమ్స్ ను, పిల్లల ప్రవర్తనలో మార్పును గమనించి, సరిచేయడంతో పాటు ప్రాపర్ కౌన్సిలింగ్ చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఆత్మహత్యల నివారణకు అమెరికాకు చెందిన క్యూపీఆర్ ఇన్ స్టిట్యూట్ వారు బెంగళూరులో ఓ పార్ట్ నర్ తో ఒప్పందం చేసుకున్నారు.

స్కూల్ కౌన్సిలర్ ట్రైనింగ్ కోసం గైడెన్స్, ఇంటర్వెన్షన్, క్రైసిస్ సపోర్ట్ మేనేజ్ మెంట్ కు వారితో సంప్రదిస్తున్నాం. ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం టెలీ కౌన్సిలింగ్ సర్వీస్ ఏర్పాటుచేస్తాం. పిల్లల్లో ఒత్తిడి, ఆందోళన తగ్గించేందుకు కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల విషయానికి వస్తే.. మెంటర్ మెంటీ సిస్టమ్ కూడా తీసుకువచ్చాం. ఎన్ సీసీ, రెడ్ క్రాస్ ను కూడా పాఠశాల విద్యలో తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఎన్ సీసీ డైరెక్టరేట్ ఇవ్వాలని కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ని కూడా కోరడం జరిగింది. రెప్యుటెడ్ ఎన్జీవోస్ తో ఒప్పందం కుదుర్చుకుని ఆత్మహత్యలు నివారించాలని, పిల్లల్లో ఎర్లీ సింప్టమ్స్ ను గుర్తించాలని మా అధికారులకు కూడా చెప్పాం.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేస్తాం

విద్యార్థులు ఒత్తిడిలో ఉన్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆత్మహత్యలకు ర్యాగింగ్, అకడమిక్ స్ట్రెస్, ఫీజు చెల్లింపులు ప్రధాన కారణం. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. గత ప్రభుత్వం హైస్కూల్ ప్లస్ తీసుకువచ్చారు. అక్కడ సబ్జెక్స్ టీచర్స్ ను ఇవ్వాలి. మండలానికి ఒక గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఉండాలి. మేం ఇంటర్ విద్యార్థులకు కిట్ తో పాటు మధ్యాహ్న భోజనం తిరిగి ప్రారంభించాం. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మెరుగైన విద్య అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

### ప్రైవేటు యాజమాన్యంపైనా బాధ్యత ఉంది

తల్లిదండ్రులు కూడా ఫీజు కట్టాం కాబట్టి అన్ని సబ్జెక్ట్ ల్లో మార్కులు రావాలని ఒత్తిడి పెడుతున్నారు. ఒత్తిడి తగ్గించేందుకు కూడా ఆలోచన చేస్తున్నాం. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు తీసుకువచ్చాం. కొత్త అవకాశాలు కల్పిస్తున్నాం. కరిక్యులమ్ రీవ్యాంప్ చేస్తున్నాం. తల్లి దండ్రుల నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తీసుకుంటున్నాం. ఆత్మహత్యలు చోటు చేసుకోవడం చాలా తీవ్రమైన అంశం. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కౌన్సిలింగ్ ఉండాలి.

ప్రైవేటు, గవర్నమెంట్ ఇద్దరికీ కౌన్సిలింగ్ ఉండాలి. ప్రైవేటు యాజమాన్యంపై కూడా బాధ్యత ఉంది. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ఏం చర్యలు తీసుకుంటున్నారని వాకబు చేస్తున్నాం. హ్యుమిలియేషన్ ను కూడా తట్టుకోలేక పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఆత్మహత్యల నివారణకు అందరం కలిసికట్టుగా కృషిచేయాలి. ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉంది.

### విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువస్తున్నాం

ప్రభుత్వ విద్యను కూడా బలోపేతం చేసి పరిశ్రమలకు అనుసంధానించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారు. కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువస్తోంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. మౌలిక సదుపాయాలు, బోధనను మెరుగుపర్చడంతో పాటు, ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను ప్రభుత్వమే అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పాఠశాలల్లో యాక్టివ్ ఏపీ ప్రాజెక్ట్ కింద వచ్చే ఏడాది నుంచి వారానికి 150 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ ఏర్పాటుచేస్తాని, స్కూల్స్ గ్రౌండ్స్ అన్నీ మ్యాప్ చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. చక్రపాణి నివేదికపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు.

# బీసీ రిజర్వేషన్ల పెంపునకు మూడు వేర్వేరు బిల్లులు పెట్టాలి

- లేదంటే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయి
- ఇది గంభీరమైన అంశం... ప్రభుత్వం ఆలోచించి అడుగులు వేయాలి
- బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఓడించాయి
- పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు
- బీసీల ఓటమికి కలిసి పనిచేసిన ఆ రెండు జాతీయ పార్టీలు

**హైదరాబాద్:** రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్లు పెంపునకు మూడు వేర్వేరు బిల్లులను అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లను పెంచడానికి మూడు వేర్వేరు బిల్లులను ప్రవేశపెట్టాల్సిందేనని, లేదంటే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని ప్రభుత్వానికి సూచన చేశారు. ఇది గంభీరమైన అంశమని, కాబట్టి ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి అడుగులు వేయాలని స్పష్టం చేశారు.

గురువారం తన నివాసంలో మీడియాలో మాట్లాడుతూ.... విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్ అంశం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉంటుందని, కేవలం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అంశం మాత్రమే రాష్ట్ర జాబితాలో ఉంటుందని గుర్తు చేశారు. అయితే, ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా, ఉద్యోగ రంగాలను, రాష్ట్ర జాబితాలో ఉండే స్థానిక సంస్థల వేర్వేరుగా చేసి రిజర్వేషన్లను కల్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న కారణంగా పట్టణ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి కేసీఆర్ రాష్ట్రస్థాయిలోనే చట్టం తెచ్చి సాధ్యం చేశారని గుర్తు చేశారు.

రాష్ట్రస్థాయిలో చట్టం ద్వారా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచే అవకాశం ఉందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా అడుగులు వేస్తోందని ధ్వజమెత్తారు. మూడు ఒకే బిల్లులో పెట్టి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను పెంచకుండా కుట్ర చేస్తుందని



ఆరోపించారు. మూడు అంశాలను ఒకే బిల్లులో పెడితే న్యాయవివాదం తలెత్తుతుందని, జనాభాలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు సంబంధించిన అంశం కాబట్టి ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఇది గంభీరమైన అంశం కాబట్టి ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి నడుచుకోవాలని సూచన చేశారు.

మరోవైపు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుటిల రాజకీయ క్రీడలో బీసీ బిడ్డలు బలవుతున్నారని ఎమ్మెల్సీ కవిత విరుచుకుపడ్డారు. కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు గెలిచాయి... ప్రజాస్వామ్యం ఓడిపోయిందని తెలిపారు. ఆ రెండు పార్టీలు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఓడించాయని స్పష్టం చేశారు.

"కాంగ్రెస్, బిజెపి పార్టీలు బీసీయేతర అభ్యర్థులను బరిలోకి దింపాయి. పార్టీల పరంగా, సిద్ధాంత పరంగా ఓట్లు చీలాయి. కాబట్టి పోటీలో ఉన్న బీసీ అభ్యర్థి గెలవలేదు. ఇద్దరు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నప్పుడు బీసీలందరూ ఐక్యమవ్వాలన్న నినాదంతో ప్రసన్న హరికృష్ణకు చాలా ఓట్లు వచ్చాయి. కాబట్టి చట్టసభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు ఉండాలి. బీసీ రిజర్వేషన్లు ఉంటే ఆ స్థానంలో కచ్చితంగా అన్ని పార్టీలు బీసీకే టికెట్ ఇచ్చేవి." అని వ్యాఖ్యానించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కయ్యాయని బలంగా చెప్పడానికి కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికనే నిదర్శనమని తేల్చిచెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తీరు బీసీల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు.

## కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఓడిపోయింది

- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీలు గెలిచాయి. ప్రజాస్వామ్యం ఓడిపోయింది. కాంగ్రెస్, బిజెపి పార్టీలో బీసీయేతర అభ్యర్థులను బరిలోకి దింపింది. పార్టీలపరంగా, సిద్ధాంత పరంగా ఓట్లు చీలాయి, కాబట్టి పోటీలో ఉన్న బీసీ అభ్యర్థి గెలవలేదు.

ఇద్దరు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నప్పుడు బీసీ లందరూ కలవాలన్న నినాదంతో ప్రసన్న హరికృష్ణకు చాలా ఓట్లు వచ్చాయి. కాబట్టి చట్టసభల్లో కూడా బీసీలకు రిజర్వేషన్లు ఉండాలి. బీసీ రిజర్వేషన్లు ఉంటే ఆ స్థానంలో కచ్చితంగా అన్ని పార్టీలు బీసీకే టికెట్ ఇచ్చేవి. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లపై మూడు బిల్లులు పెట్టాలి

జనం గుండె చప్పుడు
మహానాడు
9
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 ||

మొదటి పేజీ తరువాయి..

సందర్భంలో అది స్పష్టంగా కనిపిస్తుంటుంది.

జనం పల్సు తెలిసిన మాటల మరాఠా కాబట్టే, ఆయన ప్రసంగంలో వేసే పంచ్‌లు జనక్షేత్రంలో టపాసుల మాదిరి పేలుతుంటాయి. ఆ ఇమేజ్‌తోనే ఆయన శిధిలావస్థలో కాంగ్రెస్‌ను పీసీసీ చీఫ్‌గా వెలిగించి, పార్టీని ఏకంగా అధికారంలోకి తీసుకురాగలిగారు. అసలు తెలంగాణలో కలగా మారిన కాంగ్రెస్ అధికారాన్ని, నిజం చేయడంలో రేవంత్‌దే కీలకపాత్ర. సూటిగా చెప్పాలంటే అది రేవంత్ రెక్కల కష్టమే. ఆయన పీసీసీ చీఫ్‌గా లేకపోతే, కాంగ్రెస్ ప్రతిపక్షంలోకి రావడం కూడా కష్టమయ్యేదేమో?!

అలాంటి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిన ముచ్చట, సహజంగా రేవంత్‌రెడ్డి పనయిపోయింది.. ఆయన గ్రాఫ్ పడిపోతోందన్న సంకేతాలకు కారణమవుతోంది. అంటే ఈ ఏడాదిలో ఆయన సర్కారు సాధించిన విజయాలను పట్టభద్రులు, టీచర్లు పెద్దగా పట్టించుకోవడం లేదన్నమాట.

లేకపోతే రేవంత్ ఎన్నికల ప్రచార వేదికలపై ఏకరవు పెట్టిన ప్రభుత్వ విజయాలన్నీ ఓటర్లు నిజమని భావించి ఉంటే, ఆయన పార్టీకే మళ్లీ చేతెత్తి జైకొట్టేవాళ్లే కదా?! తాను ఫలానా హామీ నెరవేరిస్తేనే మా పార్టీకి ఓటేయాలని రేవంత్ చెవినిల్లు కట్టుకుని,పథకాలుకరు పెట్టినా, ఓటరు కాంగ్రెస్‌కు ఓటు వేయలేదు. అంటే ఆ ప్రకారంగా.. రేవంత్ చెప్పినవేమీ చేయలేదన్నట్లే కదా?!

నిజానికి కేసీఆర్ జమానాలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతం ఎప్పుడు వస్తుందో, ఏ జిల్లాకు ముందు ఇస్తారో తెలియని పరిస్థితి. తెలంగాణ వస్తే నిరుద్యోగులకు ఇంటికో ఉద్యోగం ఇస్తారన్న ఆశలు నెరవేరని పరిస్థితి. నిర్బంధాలు, స్వేచ్ఛపై కత్తిగాట్లు పడిన, నియంతృత్వ వాతావరణం ఉండేది. ఇప్పుడు వీటిలో బీఆర్ఎస్ నేతలపై కేసులు, వేధింపులు తప్ప.. మరేమీ లేని వాస్తవ దృశ్యం. అయినా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు దారుణంగా ఓడిపోయి, కమలం వికసించిందంటే.. ఉద్యోగులు, చదువుకున్న మేధావులు, నిరుద్యోగులు ఇంకా ఏదో కోరుకుంటున్నారని సుస్పష్టం. అదేమిటో అన్వేషించుకోవాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డి సర్కారుదే.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం.. ఏవిధంగా అయితే రేవంత్ రెడ్డి ఖాతాలో వేశారో, ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల పరాజయం కూడా, సహజంగా ఆయన ఖాతాలోనే వెళుతుంది. గెలిస్తే అది నా గొప్పతనం, ఓడితే అది మీ వైఫల్యం అని తప్పించుకోవడం కుదరదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడితే తమ కొచ్చే నష్టం లేదని రేవంత్ ముందే చెప్పినప్పటికీ.. పార్టీ ఓటమికి నైతిక బాధ్యత నిస్సందేహంగా రేవంత్‌రెడ్డిదేనన్నది సీనియర్ల ఉవాచ.

అసలు అభ్యర్థుల ఎంపికలో పడిన తప్పులే, ఫలితం వరకూ కొనసాగాయని.. రేవంత్ తొలుత తాను అభ్యర్థిని ఎంపిక చేసి, దానిని

# రేవంత్ పనయిపోయిందా?

మిగిలిన వారితో ఒప్పించడమనే తెలివితేటలు ఎంపిక వరకూ సక్సెస్ అయినప్పటికీ.. వారిని ఓడిపోకుండా, కాపాడేందుకు మాత్రం పనికిరాకుండా పోయాయి. అదే విషాదం. అదే ఇప్పుడు రేవంత్ పయినపోయిందన్న భావన-రేవంత్ గ్రాఫ్ పడిపోయిందన్న ప్రచారానికి కారణం.

సంస్థాగ త కోణంలో చూస్తే.. ఈ పరాజయంలో పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్‌కూ భాగస్వామ్యం ఉండాలి. కానీ ఆయన నిమిత్తమాత్రుడని, రేవంత్ చెప్పిన దానిని ఆమోదించడమే ఆయన కర్తవ్యమన్న ప్రచారం బహిరంగమే. కాబట్టి అభ్యర్థుల ఎంపిక-ప్రచారాన్ని జమిలిగా భుజాన వేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కరే, ఈ అవమానం భరించడం అనివార్యమవుతోందన్నది సీనియర్ల వ్యాఖ్య.

అందరికీ అన్ని కాలాలు కలసిరావు. విజయలక్ష్మి ఎప్పుడూ పర్మినెంట్‌గా ఒకరి భుజం మీదపనే వాలిపోదు. ఈ తత్వం తెలియకనే చాలామంది పాలకులు, నాయకులు.. ఇక ఈ పదవి శాశ్వతమని, తమ తెలివికితామే మురిసిపోతుంటారు. అన్ని చోట్లా తమ చక్రం.. విష్ణు చక్రం-భూచక్రంలా తిరుగుతుందని భ్రమిస్తుంటారు. అందుకు ఎవరూ మినహాయింపు కాదు.

అదేం విచిత్రమోగానీ కాంగ్రెస్‌లో పరిణామాలు ఎప్పుడు? ఎందుకు? ఎలా మారతాయన్నది ఎవరికీ అంతుపట్టదు. జరుగుతున్న సంఘటనల ఆధారంగా, విధి తారుమారైన సీఎంలు బోలెడు. అంటే వాటికోసమే కాచుకుని కూర్చునే వర్గం పార్టీలో ఒకటి ఉంటుంది. వీరికి జనంలో బలం లేకపోయినా, ఢిల్లీలో కావలసినంత బలం ఉంటుంది. రేవంత్ మాదిరిగా వారు క్రౌడ్‌పుల్లర్స్ కాకపోయినా, నోటిమాట రాకపోయినా ఫర్వాలేదు. అది అర్హత కానేకాదు. సోనియమ్మ కోటరీ చల్లనిచూపులంటే చాలు.

అందుకే క్షేత్రస్థాయిలో.. నయాపైసాకి సైతం పనికిరాని నేతల ప్రభ, ఢిల్లీలో దేదీప్యమానంగా వెలిగిపోతుంటుంది. వారే ఆయా రాష్ట్రాల్లో జరిగే వ్యవహారాలన్నీ పూసగుచ్చినట్లు ఢిల్లీకి చేరవేస్తుంటారు. కాంగ్రెస్ హైకమాండ్ కూడా అటు సీఎంలను, ఇటు వాళ్లను వ్యతిరేకించే నాయకులూ చేరదీస్తుంటుంది. మొత్తంగా రాష్ట్రాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవడమే వారి విధి. అందుకే సమ్మతి-అసమ్మతిని దువ్వుతుంటుంది. ఇది దశాబ్దాలుగా కాంగ్రెస్ కొనసాగిస్తున్న రాజకీయ ఎత్తుగడ.

ఒక్క దివంగత వైఎస్‌కు మాత్రమే ఆ విషయంలో మినహాయింపు ఇచ్చింది. ఎందుకంటే సోనియా వైఎస్‌ను, పార్టీ నేతగా కాకుండా సొంత కుటుంబసభ్యుడిగా భావించారు కాబట్టి. వైఎస్ సైతం తన బిడ్డలతో మనకు కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు ఇచ్చింది. రాహుల్‌ను ప్రధాని చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. ఆరోజు నేను ఫ్లైట్‌లో రాజీవ్‌ను కలిసిన సందర్భమే నన్ను పీసీసీ అధ్యక్షుడిని చేసింది. కాబట్టి మన కుటుంబం ఇందిరా కుటుంబానికి రుణపడి ఉండాలి అని చెప్పేవారట. వైఎస్ మృతి చెందిన తర్వాత సోనియాను కలసిన షర్మిలను హత్తుకున్న సోనియా.. ‘ వైఎస్ మా ఇంటి మనిషి. ఆయన మరణించడం వ్యక్తిగతంగా మా కుటుంబానికి తీరని నష్టం’ అని అన్నారంటే, సోనియా మనసులో వైఎస్ స్థానమేమిటన్నది సుస్పష్టం.

గతంలో మాణిక్యం ఠాకూర్ తెలంగాణ కాంగ్రెస్ ఇచ్చార్జిగా ఉన్నప్పుడు, ఆయన పార్లమెంటు క్యాంటీన్‌లో ఉన్న సోనియాను కలిశారట. ఆ సందర్భంగా.. తెలంగాణలో రేవంత్ బ్రహ్మాండంగా పనిచేస్తున్నారని, వైఎస్‌లా దూసుకుపోతున్నారంటూ చిన్న భజన కార్యక్రమం మొదలుపెట్టబోయారట. దానికి సీరియస్ అయిన సోనియా.. తాగుతున్న టీని ఆపి, ‘ఇంకెప్పుడూ వైఎస్‌ను ఇతరులతో పోల్చవద్దు. అతను కాంగ్రెస్ మనిషి. నా ఫ్యామిలీ మెంబర్ లాంటివాడ’ని మెత్తగా మందలించారట.

దానితో దిద్దుబాటుకు దిగిన ఠాకూర్.. అంటే రేవంత్ కూడా వైఎస్ మాదిరిగానే పాలిస్తున్నాడని చెప్పబోతే, మరోసారి వైఎస్‌ను ఎవరితోనూ పోల్చవద్దని హెచ్చరించారట. సహజంగా కాంగ్రెస్ రాష్ట్ర ఇన్చార్జులు సీఎంలకు సింక్ అయితే, వారి కోసం ఏమైనా చేస్తుంటడారు. గతంలో వైఎస్ జీవించినప్పుడు గులాంనబీ ఆజాద్ చేసింది కూడా అదే.

ఇప్పుడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి నీళ్లు ఒదులుకున్న సందర్భం, అసమ్మతి దళాలకు బాగా కలసివచ్చినట్లుంది. కేవలం రేవంత్ అసమర్థత వల్లనే పార్టీ ఓడిపోయిందని, ఎవరినీ సంప్రదించకుండానే అభ్యర్థులను ఎంపిక చేశారన్న ఫిర్యాదుల పర్వానికి తెరలేపారట. తన చుట్టూ తిరిగేవారిని, తన కులం వారినే రేవంత్ ప్రోత్సహిస్తున్నారంటూ పితూరీలు పంపారట. జనంలో ఏమాత్రం బలం లేనివారంతా రేవంత్ ఇంటి దగ్గర, సచివాలయం, ఢిల్లీ పర్యటనల్లో కనిపిస్తున్నారంటూ, వాటికి సంబంధించిన ఫొటోలను కూడా సాక్ష్యంగా పంపించారట.

ఎంపికల సమయంలో తానే ముందుగా అభ్యర్థులను నిర్ణయించి, దానిని తన రాజకీయ చతురత, లౌక్యంతో ఆమోదించుకునే తెలివైన రాజకీయాలు చేస్తున్నారని, అసలు ఇప్పటివరకూ జరిగిన ఏ ఎంపికలోనూ నాయకుల అభిప్రాయాలు తీసుకున్న దాఖలాలు లేవని ఏకరు పెట్టారట. సోషల్‌మీడియా సహా మీడియాలో తన వ్యక్తిగత ప్రచారానికే ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్‌రెడ్డి, పార్టీని పట్టించుకోవడం లేదని మరో ఫిర్యాదు చేశారట.

మౌత్ పబ్లిసిటీలో మిగిలిన పార్టీల కంటే కాంగ్రెస్‌లోనే ఎక్కువ గత్తర ఉంటుంది. ఆ ప్రకారంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైనందున రేవంత్‌ను తొలగించబోతున్నారని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని గద్దెనెక్కించబోతున్నారని కొందరు, భట్టిని సీఎం చేయబోతున్నారని ఇంకొందరు అప్పుడే ప్రచారం ప్రారంభించడమే కాదు. వాటిని కొన్ని మీడియా సంస్థల ద్వారా అప్పుడే ప్రచారంలోకి పెట్టేశారు. ‘ఢిల్లీ అవసరాలు’ ఎవరైనా తీర్చాల్సిందే కాబట్టి, ఆ పని రేవంత్ స్థానంలో ఎవరున్నా చేస్తారన్నది తమ వాదనకు వారు వినిపించే ఓ గొప్ప సూత్రీకరణ. నిజం సోనియమ్మకెరుక?

ప్రతిదానికీ ‘మరి నా సంగతేమిట’ని అడుగుతున్న పాత ఇన్చార్జి మున్షీని మార్చి, కఠినంగా ఉండే మీనాక్షమ్మను తెచ్చారన్నది ఆ వర్గాల మరో లాజిక్. అసలు మీనాక్షమ్మ వచ్చిందే కొత్త సీఎం ఎంపిక కోసమని, ఆమె ఆ పనిలో భాగంగానే నాయకులతో భేటీలు వేస్తున్నారంటున్నారు. రేవంత్‌కు కత్తెర వేసేందుకే ఆమె అసలు కాంగ్రెస్- కొసరు కాంగ్రెస్-కొత్త కాంగ్రెస్ అనే మూడు ప్రాతిపదికలకు ఊపిరిపోసి, పదవులు కూడా ఆ ప్రకారంగా ఇస్తారన్నది కొత్త ప్రచారం.

అంటే తొలి నుంచి పార్టీ మారకుండా కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్న భట్టి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి, పొన్నం లాంటి ‘పుట్టు కాంగ్రెస్’ నాయకులన్నమాట. మరికొందరు ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరినవారు. మూడవ కేటగిరీ వాళ్లెవరంటే, అధికారం వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారు. ఆ లెక్కన రేవంత్‌ది ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన కేటగిరీ అన్నమాట.

సరే.. ఇప్పుడు కాంగ్రెస్ పరాజయ ప్రస్థానం సంగతి పక్కనబెడితే, తెలంగాణలో కమల వికాసం ఖాయమన్న స్పష్టమైన సంకేతాలు వెలువడటమే, కాంగ్రెస్ ఢిల్లీ పార్టీకి ఆందోళన కలిగించే అంశం. పార్టీకి ఆక్సిజన్ అందిస్తున్న తెలంగాణ, కర్నాటకలో తెలంగాణలో పార్టీ బలహీనపడుతుండటం సహజంగా పార్టీ బాసులకు ఆందోళన కలిగించే వ్యవహారమే. తెలంగాణలో చాపకింద నీరులా విస్తరిస్తున్న పువ్వు పార్టీని అడ్డుకోకపోతే.. తమకు ‘బొచ్చెలో రాయి’ ఖాయమన్న ఆందోళనతో ఉన్న హైకమాండ్, ఇక పూర్తిగా తెలంగాణ పార్టీని, మీనాక్షమ్మ ద్వారా తన చేతుల్లోకి తీసుకోవడం ఖాయమన్నది సీనియర్ల మరో కథనం.

పువ్వు పార్టీనే ప్రత్యామ్నాయం!

నిజంగా మందు బాటిళ్లు, ఓటర్లకు డబ్బులు పంచకుండా ఇద్దరు బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవడం అద్భుతమే. అంటే దీన్నిబట్టి తెలంగాణ ప్రజలు, బీజేపీని ప్రత్యామ్నాయ పార్టీగా ఎంచుకుంటున్నట్లు.. మెడపై తల ఉన్న ఎవరయినా భావించక తప్పదు. రేవంత్ తన హయాంలో అన్ని చేశా.. ఇన్ని చేశానని చెప్పి, మోదీ-కేసీఆర్‌ను ఎన్ని తిట్టి చప్పట్లు కొట్టించుకున్నప్పటికీ, ఆయన వాదన అరణ్యరోదనే అయిందనేది నిష్ఠుర నిజం.

అయితే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేసి ఉంటే, ఓట్లు చీలి కాంగ్రెస్ కథ మరోలా ఉండేదమో? అందుకే స్థితప్రజ్ఞత-ప్రాప్తకాలజ్ఞత కలబోసిన కేసీఆర్, తన పార్టీని ఈ ఎన్నికలకు వ్యూహాత్మంగా దూరంగా ఉంచడాన్ని విస్మరించలేం. అంటే పువ్వు పార్టీ, ఆ మేరకు కేసీఆర్‌కు కృతజ్ఞత చెప్పాల్సిందే. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కూడా.. పోటీకి దూరంగా ఉండటం వ ల్లనే కాంగ్రెస్ పడవ విజయతీరానికి చేరడాన్ని విస్మరించకూడదు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒక రెడ్డి, ఒక బీసీ అభ్యర్థి విజయం సాధించారంటే.. తెలంగాణలో ఇక బీజేపీ అడుగులు, సచివాలయానికి కొద్ది దూరంలోనే ఉందన్నమాట.

## బీసీలూ బీజేపీకే జైకొట్టారా?

ఇక తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు వినిపించిన బీసీ వాదానికి ఓట్లు రాలకపోవడం మరో ఆసక్తికర అంశం. ఆ పార్టీకి చెందిన ఒక బీసీ, ఒక ఓసీ అభ్యర్థి గెలిచారంటే.. దానర్థం బీసీలు, బీజేపీ వైపు ఉన్నట్లే కదా?! బీసీ అభ్యర్థులకే ఓట్లు వేయాలంటూ ఎన్నికల ముందు మొదలైన ఉద్యమం, ఫలితాల్లో భూతద్దం పెట్టి వెతికినా కనిపించలేదంటే, ఓటరు కోణం వేరన్నది సుస్పష్టం.

కరీంనగర్ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి బీసీ అయినప్పటికీ, ఆయన గెలుపును పార్టీ కోణంలో చూడాలే తప్ప, కులం కోణంలో కాదు. పోనీ ఆ లెక్క ప్రకారం చూసినా, గెలుపులో కీలకపాత్ర పోషించిన సంజయ్, అర్వింద్ అండ్ అదర్స్ మున్నూరు కాపులే! పైగా బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య, బీజేపీ అభ్యర్థులకే ఓటు వేయమని పిలుపునివ్వడాన్ని విస్మరించకూడదు.

అంటే బీజేపీలో ఉన్న బీసీ నేత కృష్ణయ్య గెలిచారా? బీజేపీ బీసీ అభ్యర్థులకు వ్యతిరేకంగా ఉన్న బీసీ అభ్యర్థులకు ఓటేయమని చెప్పిన బీసీ నేతలు గెలిచారా? ఇదో పెద్ద చర్చ. సో.. ఎన్నికల ముందు తెరపైకి వచ్చే ఇలాంటి వాదాలకు ఓట్లు పడటం లేదని దీన్ని బట్టి స్పష్టమవుతోంది.



జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || శుక్రవారం 07, మార్చి 2025 ||






## పూజా కార్యక్రమాలతో "మూకుతి అమ్మన్ 2"

నయనతార లీడ్ రోల్‌లో సుందర్ సి దర్శకత్వంలో తమిళ చిత్ర పరిశ్రమలోని ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థలలో ఒకటైన వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి బిగ్గెస్ట్ పాన్ ఇండియా ఎంటర్‌టైనర్‌లలో ఒకటైన 'మూకుతి అమ్మన్ 2'ను నిర్మిస్తోంది. అవ్ని సినిమాక్స్ (పి) లిమిటెడ్, రౌడీ పిక్చర్స్ సహా నిర్మాతలుగా వున్నాయి. ఈ చిత్రం (మార్చి 6) రూ1 కోటి విలువైన అద్భుతమైన సెట్ వర్క్‌తో గ్రాండ్ పూజా వేడుకతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో చిత్ర నటీనటులు, సిబ్బందితో పాటు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులు సునీల్ నారంగ్, జగదీష్, సి కళ్యాణ్ పాల్గొన్నారు. మూకుతి అమ్మన్ పార్ట్ 1 భారీ విజయాన్ని సాధించింది, తెలుగు డబ్బింగ్ వెర్షన్ అమ్మోరు తల్లికి బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ లభించింది. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ డాక్టర్ ఇషారి కె గణేష్ ఐవీ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి మూకుతి అమ్మన్ 2ను భారీ స్థాయిలో విజువల్ వండర్ గా నిర్మిస్తున్నారు. ఈ స్టాండ్ ఎలోన్ మూవీ 'కింగ్ ఆఫ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్' – సుందర్ సి మిడాస్-టచ్‌తో ఫ్రాంచైజీని కలిగి ఉంటుంది. ఈ చిత్రంలో ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారు.

## మార్చి 27న విక్రమ్ వీర ధీర సూరన్ పార్ట్ 2



చియాన్ విక్రమ్ మోఎస్ట్ ఎవైటెడ్ యాక్షన్-ప్యాక్డ్ మూవీ వీర ధీర సూరన్ పార్ట్ 2. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరాముడు, దుషార విజయన్ వంటి అద్భుతమైన నటులు ఉన్నారు. హెచ్.ఆర్. పిక్చర్స్ రియా శిబు నిర్మించిన 'వీర ధీర సూరన్ పార్ట్ 2' ఒక యాక్షన్ థ్రిల్లర్, ఇది ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇస్తుంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్‌కి ట్రెమండస రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు, ఈ చిత్రం మార్చి 27, 2025న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల అవుతుందని మేకర్స్ అఫీషియల్‌గా ప్రకటించారు.

తెలుగులో ఎన్వీఆర్ సినిమాస్ ద్వారా ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. జి.కె. ప్రసన్న ఎడిటింగ్ వర్క్ పర్యవేక్షిస్తున్నారు సి.ఎస్. బాలచందర్ ఆర్ట్ డైరెక్టర్.



## 'రాబిన్‌హుడ్' నుంచి కేతిక శర్మ స్పెషల్ సాంగ్

హీరో నితిన్ హైలీ యాంటిసిపేటెడ్ హీస్ట్ కామెడీ రాబిన్‌హుడ్. వెంకీ కుడుముల దర్శకత్వం వహించారు. శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని గ్రాండ్ గా నిర్మించారు. జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో రెండు పాటలు ఇప్పటికే చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి. ఈరోజు, ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థర్డ్ సింగిల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. "ది హాటెస్ట్ సర్ప్రైజ్ ఆఫ్ ది ఇయర్" గా సిజ్లింగ్ దివా కేతికా శర్మ నటించిన స్పెషల్ సాంగ్ మార్చి 10న విడుదల కానుంది. ఈ ట్రాక్ లో కేతికా శర్మ అల్ట్రా గ్లామరస్ గా కనిపించనుంది. ఇది ప్రేక్షకులను, సంగీత ప్రియులను సర్ ప్రైజ్ చేయబోతోంది. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ లో కేతిక శర్మ గ్లామరస్ లుక్ ఆకట్టుకుంది. బోల్డ్, స్టన్నింగ్ పెర్ఫామెన్స్ లతో ఆకట్టుకునే కేతిక శర్మ ఈ సాంగ్ లో అదరగొట్టబోతోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ బ్యూటీఫుల్ సినిమాటోగ్రఫీని అందించారు.



## జాన్వీ కపూర్ పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్

అందాల తార జాన్వీ కపూర్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్‌తో కలిసి ఆర్.సి. 16లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఉప్పెన మూవీతో బాక్సాఫీస్ షేక్ చేసిన బుచ్చిబాబు సానా ఈ చిత్రాన్ని భారీ ఎత్తున తెరకెక్కిస్తున్నారు. నేడు (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజు సందర్భంగా ఆర్.సి. 16 టీం స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. జాన్వీ కపూర్‌కు శుభాకాంక్షలను తెలియజేస్తూ మేకర్స్ సెట్ నుండి ఆమె స్టిల్‌ను రిలీజ్ చేశారు. అయితే ఇది బిహైండ్ ది సీన్‌కు సంబంధించిన స్టిల్. ఇది అఫీషియల్ లుక్ కాదు అని టీం క్లారిటీ ఇచ్చింది. మొదటి షెడ్యూల్ సమయంలో మైసూర్‌లో క్లిక్ చేసిన సాధారణ ఫోటో అని స్పష్టం చేశారు. జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ వచ్చినప్పుడు అందరూ మెస్మరైజ్ అవుతారని టీం అంచనాలు పెంచేసింది. నవంబర్ 2024లో మైసూర్‌లో జరిగిన మొదటి షెడ్యూల్‌లో జాన్వీ కపూర్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైన కొత్త షెడ్యూల్‌లోనూ జాన్వీ కపూర్ పాల్గొనబోతోన్నారు. ఈ షెడ్యూల్ 12 రోజుల పాటు కొనసాగుతుంది. హీరో, హీరోయిన్, ఇతర ఆర్టిస్టులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రంలో 'కరుణాడ చక్రవర్తి' శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తుండగా, ప్రముఖ కెమెరామెన్ రత్నవేలు విజువల్స్ అందిస్తున్నారు.

అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ఆర్.సి.16ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

## 'కింగ్‌స్టన్' ఛాలెంజింగ్ ప్రాజెక్ట్

**జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటించడంతో పాటు నిర్మించిన సినిమా "కింగ్‌స్టన్'. తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ప్యారలల్ యూనివర్స్ పిక్చర్స్, జీ స్టూడియోస్ సంస్థలపై రూపొందింది. ఇండియాలో ఫస్ట్ సి అడ్వెంచర్ థ్రిల్లర్ ఇది. ఇందులో దివ్యభారతి హీరోయిన్. 'బ్యాచిలర్' తర్వాత జీవీ ప్రకాష్ కుమార్ సరసన ఆవిడ మరోసారి నటించారు. శుక్రవారం సినిమా విడుదల అవుతున్న సందర్భంగా టాలీవుడ్ మీడియాతో ముచ్చటించారు. ఆ ఇంటర్వ్యూ విశేషాలు...**

**హాయ్... దివ్యభారతి గారు! ఎలా ఉన్నారు?**

నేను చాలా బావున్నాను అండీ. "కింగ్‌స్టన్' ' పబ్లిసిటీ కోసం హైదరాబాద్ రావడం సంతోషంగా ఉంది. లాస్ట్ ఇయర్ 'మహారాజా'లో మీరు కనిపించింది కాసేపే అయినా మంచి ఇంపాక్ట్ చూపించారు! థాంక్యూ. ఆ సినిమా తెలుగులోనూ మంచి విజయం సాధించింది. తమిళంలో నా పాత్రకు ఎంత మంచి పేరు వచ్చిందో... తెలుగులోనూ అంతే మంచి పేరు వచ్చింది. ఇక్కడ నుంచి ఎన్నో ప్రశంసలు రావడం సంతోషంగా ఉంది.

**'బ్యాచిలర్'తో జీవీ ప్రకాష్ కుమార్‌తో మీ పెయిర్‌కి మంచి పేరు వచ్చింది. మళ్ళీ ఈ సినిమాతో కాంబినేషన్ రిపీట్ అవుతోంది.**

అవును. 'బ్యాచిలర్' మంచి హిట్. అది తెలుగులో విడుదల చేస్తారని అనుకోలేదు. తెలుగులో రిలీజ్ చేశాక మంచి పేరు వచ్చింది. ఆ సినిమాతో కంపేర్ చేస్తే ఇది చాలా డిఫరెంట్ మూవీ. ఇది ఇండియాస్ ఫస్ట్ సీ అడ్వెంచర్ థ్రిల్లర్ సినిమా. అందులోనూ జీవీ ప్రకాష్ కుమార్ నిర్మాతగా చేస్తున్న తొలి సినిమా "కింగ్‌స్టన్' 'లో నేను నటించడం సంతోషంగా ఉంది. ఫస్ట్ నాకు ఆఫర్ వచ్చినప్పుడు ఆయన ఒక్కరే నిర్మాత. తర్వాత జీ స్టూడియోస్ వచ్చింది. సినిమా కోసం జీవీ ప్రకాష్ కుమార్ చాలా కష్టపడ్డారు.

**"కింగ్‌స్టన్' 'లో యాక్షన్ సీన్లు చేసేటప్పుడు గాయాలు అయ్యాయని జీవీ ప్రకాష్ తెలిపారు. మరి మీకు?**

నాకు ఎటువంటి గాయాలు కాలేదు. మా యాక్షన్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ యాక్షన్ సీన్స్ కోసం కొంత ప్రిపేర్ అయ్యాను.

**సాధారణంగా హీరోయిన్లకు యాక్షన్ సీన్లు చేసే అవకాశం రాదు కదా!**

అవును. చాలా అరుదుగా ఇటువంటి క్యారెక్టర్లు లభిస్తాయి. ఫస్ట్ యాక్షన్ చేయడం కొంత థ్రిల్లింగ్ ఫీలింగ్. ఇందులో నేను రోప్ సీన్స్ చేశా. యాక్షన్ సీన్స్ చేయడం ఎంత కష్టం అనేది తెలిసింది. ఇటువంటి ఛాలెంజింగ్ ప్రాజెక్ట్ మరొకటి నాకు వస్తుందో లేదో తెలియదు. ఆల్రెడీ సినిమా చూశా. హ్యాపీగా ఉన్నాను. ఆడియన్స్ ఎప్పుడు సినిమా చూస్తారా? అని ఎగ్జైటెడ్ గా ఉన్నాను.

**"కింగ్‌స్టన్' 'లో మీ క్యారెక్టర్ గురించి చెబుతారా?**

'బ్యాచిలర్'లో నేను సిటీ గాళ్ రోల్ చేస్తే... "కింగ్‌స్టన్' 'లో ఒక పల్లెటూరి అమ్మాయి రోల్ చేశారు. చేపలు పట్టడం ఆ ఊరి ప్రజల జీవనాధారం. సముద్ర తీరంలోని ఆ ఊరంతా మత్స్యకారులు ఉంటారు. వాళ్ళు సముద్రంలో చేపలు పట్టడానికి ఎందుకు వెళ్లడం మానేశారు? వాళ్ళకు ఉన్న శాపం ఏమిటి? దాన్ని హీరో హీరోయిన్లు ఏం చేశారు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి. నాది హీరో గాళ్ ఫ్రెండ్ రోల్. ఊరిని కాపాడటం కోసం హీరో ప్రయత్నిస్తే హీరోయిన్ ఎలా సాయం చేసింది? అతనితో సముద్రంలో ఎందుకు వెళ్ళింది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144